కాజీపేటలో కోచ్‌ఫ్యాక్టరీ ఏర్పాటుతో త్రినగరి మరింత ముందుకు వెళ్లనున్నది. చర్చలుకూడా అయిపోయిన దశలో అది ప్రారంభం కానుంది. అయితే దానికి ప్రధాన కారణం వందేభారత్, నమో రైళ్ల ప్రవేశమే కావొచ్చు. ఎందుకంటే అవి ప్రవేశపెట్టడం మూలంగా వాటికి కావాల్సిన కోచ్‌ల తయారీ అవసరం అవుతుంది. ఆ డిమాండ్‌ని తట్టుకోవడానికి పరిశ్రమల అభివృద్ధి చేయడం పరిపాటిగా మారింది. ఏదిఏమైనా పరిశ్రమల కల్పన వల్ల ఉద్యోగాలకల్పన సాధ్యంఅవుతుంది. తద్వారా కుటుంబాలు స్థిరత్వాన్ని అందుకుంటాయి. ఆర్థికప్రగతిని సాధిస్తాయి. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న భారత్‌లోతయారీ విధానంలో వాటికి కావాల్సిన ఇన్పుట్ కూడా ఇక్కడే తయారుఅవ్వడం వల్ల మరింత మందికి ఉద్యోగాల కల్పన సాధ్యం అవుతుంది.

-భారత అవినాష్, జనగామ

## వ్యాయామ విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రస్తుత సమాజంలో ఊబకాయంఎంతో ప్రమాదకరంగా మారుతుంది. పలుఆరోగ్య సమస్యలకు, ముఖ్యంగా అనేక దీర్ఘకాలిక వ్యాధులకు కారణమవుతుంది. మారుతున్న జీవన విధానం, ముఖ్యంగా ఆహారపుఅలవాట్లు మారుతుండడం ఊబకాయానికి ప్రధాన కారణమని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు. బడి ఈడుపిల్లల్లో ఈసమస్య పెరగడం ఆందోళన కలిగించే అంశం. సమతుల ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, పాఠశాల, కళాశాలల స్థాయిలో వ్యాయామ విద్యకు ప్రాధాన్యతనివ్వడం లాంటి చర్యలతో దీని నుంచి బయటపడవచ్చు.

-ఎం.ముత్యంరెడ్డి, అందెగ్రామం, సిద్ధిపేటజిల్లా

## మద్యం పాలసీలో మార్పులు చేయాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోప్రస్తుతం అమలవుతున్నమద్యం పాలసీ ఈ నెలాఖరుతో ముగుస్తున్న నేపథ్యంలో కొత్త లిక్కర్ పాలసీ రూపకల్పనపై ప్రభుత్వ మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసిన సందర్భంగా రాష్ట్ర ప్రజల ప్రయోజనాల దృష్ట్యా పాలసీ రూపకల్పనలో మార్పులు చేస్తూ పూర్తి పారదర్శకత కలిగిన మద్యం పాలసీ తయారుచేసి నియమ నిబంధనలు వందశాతం అమలుజరిగేలా చూడాలి. ముఖ్యంగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేసేటప్పుడు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలి. జనావాసాలు, రద్దీ ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు చేయడం వలన ప్రజలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు.

-రఘురామరాజు, నల్గొండజిల్లా

**ఎడిట్ పేజీకి..**

ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail: editpage@vaartha.com

# కాలుష్య నియంత్రణకు చర్యలేవి?

**ఒకవేళ పాఠశాలలకు సెలవులు ప్రకటిస్తే విద్యార్థులు చాలా నష్టపోతారు. ఆరుబయట వెళ్లటం మానుకోవాలి. ఎన్ 95 మాస్కులు వాడాలి. ఎయిర్ ప్యూరిఫైయర్లను ఉపయోగించాలి. కారు కిటికీలను తెరవకూడదు. పరిశుభ్రమైన ఇంధనాలను వాడాలి. వంటకు బొగ్గు, కలపను ఉపయోగించకూడదు. వ్యక్తిగత వాహనాల వినియోగం తగ్గించుకోవాలి. ప్లాస్టిక్, సింథటిక్ వస్తువులను నిషేధించాలి. విరివిగా చెట్లు నాటాలి. కాగితాల నుండి డిజిటల్‌కు మారాలి. పర్టిక్యులేట్ మాటర్ ఎక్కువగా ఉండే ఎయిర్ ఫ్రెష్‌నర్‌లు, డియోడరెంట్‌ల వాడకం తగ్గించాలి. గ్యాసోలిన్ యంత్రం వాడకాన్ని పరిమితం చేయాలి. క్రమం తప్పకుండా ఎయిర్ కండిషనింగ్ వ్యవస్థలను తనిఖీ చేయించుకోవాలి. ఎనర్జీ స్టార్ సర్టిఫికేట్ పొందిన ఎలక్ట్రానిక్ ఉపకరణాలను ఎంచుకోవాలి. కాలుష్య కారకాల ఉత్పత్తులను తగ్గించుకోవాలి.**

డిజె మోహనరావు

దేశ రాజధాని ఢిల్లీలో రోజురోజుకు గాలి నాణ్యత క్షీణిస్తుంది. గాలి నాణ్యత వాతావరణ అంచనా పరిశోధన వ్యవస్థ (సిస్టమ్ ఆఫ్ ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్కాస్టింగ్ అండ్ రీసెర్చ్-సఫార్) రియల్ టైమ్ డేటా ప్రకారం గాలి నాణ్యత సూచిక (ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ - ఎక్యూఐ) 21 అక్టోబర్ ఉదయం 8 గంటలకు 317 వద్ద ఉంది. గాలి నాణ్యత చాలా పేలవమైన స్థితిలో ఉందని దీనర్థం. ఊపిరితిత్తులను అడ్డుకుని అనేక వ్యాధులకు కారణమయ్యే సూక్ష్మ ధూళి కణాలు పర్టిక్యులేట్ మీటర్ (పిఎం) 2.5 స్థాయి 306గా ఉంది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా రాబోయే రోజుల్లో ఢిల్లీ రోజువారీ సగటు ఎక్యూఐ చాలాపేలవమైన స్థితిలో ఉంటుందని భారత వాతావరణ విభాగం (ఐఎండి)అంచనా వేసింది. ఎక్యూఐ అనేది ఒక ప్రాంతంలో గాలి నాణ్యతను తెలియజేసే సూచిక. ఇది ఆ ప్రాంతంలో ఉండే గాలి ఎంత కలుషితమై ఉందనే విలువను తెలియజేస్తుంది. గాలి కాలుష్యం మన ఆరోగ్యంపై ఎంత మేర ప్రభావం చూపుతాయో ఈ సూచికల విలువల బట్టి తెలుసుకోవచ్చు. గాలిలోఉన్న ఎనిమిది ప్రధాన కాలుష్య కారకాల ఉద్గారాలను కొలవటం ద్వారా గాలి నాణ్యత సూచికను పొందవచ్చు. వీటి రీడింగ్‌లు ప్రతి గంటకు గుర్తించబడతాయి. ప్రతిదేశం వాయు నాణ్యతాప్రమాణాల ఆధారంగా వాయునాణ్యత సూచికలను కలిగి ఉంటుంది. పర్టిక్యులేట్ మీటర్ (పిఎం)అనేది గణనీయమైన కాలుష్యకారకం. గాలిలో పిఎం 2.5, పిఎం 10లను కొలవటం ద్వారా గాలి నాణ్యతను తెలుసుకోవచ్చు. ఇది క్యూబిక్ మీటరుకు ఉండే కణాల సాంద్రతను తెలియజేస్తుంది. 2.5 మైక్రోన్లు లేదా అంతకంటే తక్కువ వ్యాసం కలిగిన కణాల సాంద్రతను పిఎం 2.5అని, 10 లేదా అంతకంటే తక్కువ వ్యాసం కలిగిన కణాలసాంద్రతను పిఎం 10అని అంటారు. ఈ కణాలు ఓజోన్, కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్, లెడ్, అమ్మోనియా ఉద్గారాల నుండి వెలువడి గాలిలో కలుస్తాయి. ఇవి గాలిలో ఘనకణాలు, ద్రవబిందువుల మిశ్రమం రూపంలో ఉంటాయి. ధూళి, పొగ, మసి వంటి కొన్ని కణాలు మన కళ్ళకు కనిపిస్తాయి. మరికొన్ని ఎలక్ట్రాన్ మైక్రోస్కోప్ ద్వారా మాత్రమే కనిపిస్తాయి. 2021లో చట్టబద్ధమైన సంస్థగా స్థాపించబడిన వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (సిఎక్యూఎం) నేషనల్ క్యాపిటల్ రీజియన్(ఎన్సిఆర్)పరిసర ప్రాంతాలలో వాయునాణ్యత నిర్వహణను పర్యవేక్షిస్తుంది. ఇది ఎక్యూఐ పరిమితుల ఆధారంగా నాలుగు దశలను కలిగి ఉంది. "పేలవమైన" గాలికి స్టేజ్ 1 (201-300), "చాలా పేలవమైన" (301-400) కోసం స్టేజ్ 2, "తీవ్రమైన" కోసం స్టేజ్ 3 (401-450), స్టేజ్4 "అతి తీవ్రమైనవి" (450కంటే ఎక్కువ)గా వర్గీకరించటం జరిగింది. వాయు నాణ్యత నిర్వహణా కమిషన్ అక్టోబర్ 22 ఉదయం 8గంటల నుండి జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్సిఆర్) అంతటా అక్టోబర్ 14నుండి ఉన్న గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జిఆర్‌ఎపి) మొదటి దశ కార్యాచరణ ప్రణాళికతో పాటుగా పదకొండు అంశాలతో జిఆర్‌ఎపి రెండవ దశను కఠినంగా అమలుచేయాలని సూచించింది. దీనిలోభాగంగా జాతీయ రాజధాని ప్రాంతంలో బొగ్గు, కట్టెలు, డీజిల్ జనరేటర్ సెట్ల వాడకంపై ఆంక్షలు



విధించారు. నిర్దేశిత రోడ్లపై రోజూ యాంత్రికంగా ఊడ్చటం, నీరు చల్లటం, నిర్మాణ, కూల్చివేత స్థలాల్లో దుమ్ము నియంత్రణ చర్యలు అమలుచేయాలి. ట్రాఫిక్‌రద్దీని తగ్గించటానికి, కీలక పాయింట్ల వద్ద ట్రాఫిక్ సిబ్బందిని నియమించి, ప్రైవేట్ వాహనాల వినియోగాన్ని తగ్గించేందుకు పార్కింగ్ ఫీజులను పెంచనున్నారు. అదనపు బస్సు, మెట్రో సర్వీసులను కూడా ఏర్పాటు చేయనున్నారు. ప్రజలు ప్రజారవాణాను ఉపయోగించాలని, వ్యక్తిగత వాహనాల వాడకాన్ని తగ్గించాలని, వాహన ఎయిర్ ఫిల్టర్లను క్రమం తప్పకుండా మార్చాలని, దుమ్మును ఉత్పత్తి చేసే నిర్మాణ కార్యకలాపాలను అక్టోబర్ నుంచి జనవరి వరకు పరిమితం చేయాలనిఅధికారులు సూచించారు. ట్రాఫిక్ రద్దీ పాయింట్ల వద్ద తగినంత సిబ్బందిని మోహరిస్తారు. పార్కింగ్ ఫీజులను పెంచి ప్రైవేట్ రవాణాను తగ్గించనున్నారు. బస్సు, మెట్రో సేవల ఫ్రీక్వెన్సీని పెంచారు. ఢిల్లీఎన్సిఆర్ అంతటా ఘనవ్యర్థాలు బయోమాస్‌ను బహిరంగంగా కాల్చటం పూర్తిగా నిషేధించబడింది. 97ట్రాఫిక్ రద్దీ ప్రాంతాల్లో అదనంగా 1,800మంది ట్రాఫిక్ సిబ్బందిని నియమించను న్నారు. కాలుష్య హాట్ స్పాట్లలో వాటర్ స్ప్రేయింగ్ పెంచ టానికి ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ మరో 6,200 మంది కార్మికులను నియమించింది. హర్యానా, యూపి, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి ఢిల్లీలోకి డీజిల్ బస్సుల ప్రవేశాన్ని నిలిపివేయటమో లేదా పరిమితం చేయటమో చేయనున్నారు. వాటి నుండి వచ్చే ఉద్గారాలను నియంత్రించటానికి కఠిన నిబంధనలు అమలు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఢిల్లీ పొరుగు రాష్ట్రాలైన పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లలో పంట వ్యర్థాలను కాల్చటం కాలుష్యానికి ప్రధానకారణం. పంట దహనానికి పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవటంలో హర్యానా, పంజాబ్ విఫలమయ్యాయని అక్టోబర్ 16న సుప్రీంకోర్టు విమర్శించింది. ఇంకా గాలివేగం తక్కువగా ఉండటం, పండుగల సమయంలో టపాసులు పేల్చటం వంటి వివిధ కారణాలవల్ల గాలి ముఖ్యంగా విషపూరితంగా మారుతుంది. పవర్ ప్లాంట్లు, పరిశ్రమలు, ఆటోమొబైల్స్ మొదలైన వాటి ద్వారా విడుదలయ్యే కాలుష్య కారకాలు గాలిలో సంక్లిష్ట రసాయన ప్రతిచర్యల ద్వారా ప్రమాదకర రేణువులు ఉత్పత్తి అవుతున్నాయి. ఇంధన చెక్కముక్కలు, ఎండుగడ్డి, ఆకులు, పశువుల పేడ తడి మిశ్రమం నుండి తయారు చేయబడే వంట ఇంధనాలు, గోధుమలను నాటటానికి భూమిని త్వరగా సిద్ధం చేయటానికి పంట కోత, తర్వాత అవశేషాలను కాల్చటం, బయోమాస్ బర్నింగ్, చుల్హాస్ వాడకం, టైర్ పైరోలిసిస్ ప్లాంట్లు, ఇంధన కల్తీ, ట్రాఫిక్ రద్దీ వంటి వాటి వలన వెలువడే కాలుష్య కారకాలు గాలి నాణ్యతను దెబ్బతీస్తున్నాయి. ఐదేళ్ళలోపు పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులు, రోగనిరోధకత తక్కువగా ఉన్నవారు ఎక్కువగా ప్రభావితమవుతారు. ఇంకా ఆటోడ్రైవర్లు, రిక్షాపుల్లర్లు, ట్రాఫిక్ పోలీసులు వంటివారికి ప్రమాదం. అలాగే వీధి వ్యాపారులపై ప్రభావం చూపుతుంది. ఒకవేళ పాఠశాలలకు సెలవులు ప్రకటిస్తే విద్యార్థులు చాలా నష్టపోతారు. ఆరుబయట వెళ్లటం మానుకోవాలి. ఎన్ 95 మాస్కులు వాడాలి. ఎయిర్ ప్యూరిఫైయర్లను ఉపయోగించాలి. కారు కిటికీలను తెరవకూడదు. పరిశుభ్రమైన ఇంధనాలను వాడాలి. వంటకు బొగ్గు, కలపను ఉపయోగించకూడదు. వ్యక్తిగత వాహనాల వినియోగం తగ్గించుకోవాలి. ప్లాస్టిక్, సింథటిక్ వస్తువులను నిషేధించాలి. విరివిగా చెట్లునాటాలి. కాగితాల నుండి డిజిటల్‌కు మారాలి. పర్టిక్యులేట్ మాటర్ ఎక్కువగా ఉండే ఎయిర్ ఫ్రెష్‌నర్‌లు, డియోడరెంట్‌ల వాడకం తగ్గించాలి. గ్యాసోలిన్ యంత్రం వాడకాన్ని పరిమితం చేయాలి. క్రమం తప్పకుండా ఎయిర్ కండిషనింగ్ వ్యవస్థలను తనిఖీ చేయించుకోవాలి. ఎనర్జీ స్టార్ సర్టిఫికేట్ పొందిన ఎలక్ట్రానిక్ ఉపకరణాలను ఎంచుకోవాలి. కాలుష్య కారకాల ఉత్పత్తులను తగ్గించుకోవాలి. ●

# పరీక్షల్లో అంతర్గత మూల్యాంకనానికి చోటేది?

సి.వి.ప్రసాద్

విద్యార్థుల మెదడులో ఉన్న నిపుణతను వెలికి తీయడం కోసమే పూర్వంనుంచి పరీక్ష విధానాన్ని గురువు ప్రయోగాత్మకతత్వాన్ని నిరూపింపచేసి, సైద్ధాంతిక వివరణ పొందేవాడు. రానురాను ఇది ప్రశ్నా, జవాబు పద్ధతికి చేరిపోయింది. దీంతో విద్యార్థుల్లో ఏం పరీక్షించాలని అనుకున్నామో అవి పరీక్షించుకోలేకపోతున్నాం. అందుకే పరీక్షా విధానంలో లోపాలు పరిశీలించి సంస్కరణలతో ముందుకు రావాల్సి ఉండగా మూసపద్ధతిలోనే పరీక్షలు జరిగిపోతున్నాయి. దీంతో విద్యార్థుల ప్రతిభాపాటవాలు శాస్త్రీయంగా గుర్తించే పరీక్షావిధానం రావాల్సి ఉంది. దీనికి తార్కాణం అత్యంత ప్రతిష్టాత్మకమైన పదవ తరగతి పరీక్షల విధానమే అని చెప్పవచ్చు. ప్రస్తుతం నిర్వహిస్తున్న జరుగుతున్న 10వ తరగతి పరీక్షల విధానంలో అంతర్గత మూల్యాంకనానికి చోటేలేకుండాపోయింది. దీంతో బట్టివిధానంతో పోలి ఉన్న పరీక్షావిధానం అమలు అవుతూ ఉన్నది. దీంతో విద్యార్థుల్లో ఉన్న నిపుణత, నైపుణ్యాలను, తెలివితేటలను కచ్చితంగా కొలమానం చేయడానికి ప్రస్తుత పరీక్ష విధానాన్ని మార్చాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి పాఠశాలల్లో సిబిఎస్సీ పరీక్ష విధానాన్ని రద్దు చేసి రాష్ట్ర ఎస్ఎస్‌సి బోర్డు పరీక్ష విధానంలోకి ఈ విద్యాసంవత్సరం నుంచి మార్పు చేసిందే కానీ మూలాలను కదిలించలేకపోయింది. గతంలో 11వ తరగతిని ఎస్ఎస్ఎల్సిగా పిలిచేవారు. 1969 నుంచి దీన్ని ఎస్ఎస్‌సిగా మార్పుచేసి 10వ తరగతి నిర్ణయించారు. వార్షిక ఉత్తీర్ణతను వార్షికపరీక్షల్లో మార్కుల శాతాన్ని బట్టి మొదటి, ద్వితీయ, తృతీయ శ్రేణులుగా నిర్ణయించేవారు. తర్వాత ఎ, బి, సి, డి డివిజన్లుగా రూపాంతరం చెందింది. తర్వాత 2009లో గ్రేడింగ్ విధానాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. మార్కుల సంఖ్యను బట్టి ఏ1, ఏ2, బి1, బి2, సి1, సి2, డి1, డి2, యి గ్రేడులుగా నిర్ణయించారు. ఈ విధానమే ఇప్పటి వరకు కొనసాగుతూ ఉన్నది. కొంతకాలం అంతర్గత మూల్యాంకనానికి 20 శాతం, బాహ్య మూల్యాంకనానికి 80 శాతం కలిపి 100 శాతానికి ప్రతిభాపాటవాలు గుర్తించే విధానం ఉండగా 2019లో రద్దుచేశారు. కానీ ప్రస్తుతం 11 పేపర్ల విధానానికి స్వస్తిపలికి ఏడుపేపర్ల విధానాన్ని ప్రవేశపెట్టి 100 బాహ్యమూల్యాంకనానికి పట్టంకట్టడంతో మరలా ప్రశ్న, జవాబు విధానానికే ప్రభుత్వం మొగ్గు చూపినట్లయింది. ప్రస్తుతం ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు సిసిఈ విధానంలో 80శాతం బాహ్య, 20శాతం అంతర్గత మూల్యాంకన పరీక్షా విధానం కొనసాగుతూ ఉన్నది. కానీ అంతర్గత మూల్యాంకనం ప్రాజెక్టులు, చదవడం, రాయడం అంశాలపై సాధన అంచనాలు తూతూ మంత్రాలుగానే కొనసాగుతున్నాయి. దీనికి ప్రధాన కారణం నిర్దిష్టమైన ప్రణాళికలు లేకపోవడం, పాఠశాలలో ల్యాబులు, లైబ్రరీ సౌకర్యాన్ని బలోపేతం చేయకపోవడమే. విద్యార్థుల్లో అంతర్గత మూల్యాంకాలని అంతర్గత శక్తులను పెంపొందించడానికి గణిత, సైన్సు లైబ్రరీ వ్యవస్థలను బలోపేతం చేయాల్సి ఉంది. కానీ పిఎంశ్రీ కింద ఎంపిక కాబడినటువంటి పాఠశాలల్లో మాత్రమే ల్యాబులు వ్యవస్థను బలోపేతం చేశారు. కొన్ని ప్రశ్నలకు మాత్రమే పరీక్ష నిర్వహించి ప్రతిభను లెక్కించడం వల్ల సంపూర్ణ మూర్తిమత్వాన్ని అంచనా వేయలేం. ప్రశ్నమూసలో పరీక్షించడంతో విద్యార్థి బట్టి విధానానికి అలవాటుపడిపోతున్నాడు. పాఠ్యాంశాలలో ముఖ్యమైన వాటిపైన మాత్రమే శ్రద్ధవహిస్తున్నారు. ముఖ్యంగా ప్రస్తుత 10వ తరగతి చివరి మూల్యాంకన విధానంలో హాజరు, అసైన్మెంట్లు, విద్యార్థుల ప్రవర్తన మొదలగు అంశాలకు ప్రాధాన్యత ఇస్తే విద్యార్థులకు న్యాయం జరుగుతుంది. పాఠశాల తరగతిగదుల్లో విద్యార్థి ప్రవర్తన, నిరంతర మూల్యాంకన విధానంలో చొరవ, అసైన్మెంట్ ఎక్స్ట్రా కరికులం కృత్యాలు, ప్రయోగాత్మక నిపుణత మొదలగు అంశాలన్నింటిని పరిగణనలోకి తీసుకునేవిధంగా పరీక్షవిధానంమారాల్సి ఉంది. అప్పుడే విద్యార్థి ఆలోచన శక్తి పెరిగి ప్రవర్తన తీరు మార్పుతో అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపడి సమగ్ర మూర్తిమత్వం పెంపొందుతుంది. పేపర్ల సంఖ్య తగ్గించి గ్రేడింగ్ విధానాలతో మూల్యాంకన ఫలితాన్ని ప్రకటిస్తే విద్యార్థుల్లో నైరాశ్యం పెరిగే అవకాశాలు లేకపోలేదు. పేపర్ల సంఖ్య తగ్గడం వల్ల విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించవచ్చుఅన్నది అంచనా మాత్రమే. తలకు భారమైన సిలబస్ ప్రశ్న, జవాబు పద్ధతులకు స్వస్తిచెప్పి ప్రయోగ విధానంపట్ల ఆసక్తిని పెంపొందించాల్సి ఉంది. ఉపాధ్యాయుల బోధనవిధానం, పిల్లల అభ్యసన తీరులో మార్పులు తీసుకురావాల్సి ఉంది. విద్యార్థులు సమాజాన్ని, ప్రకృతిని పరిశీలించి తమ బతుకులకు తామే నిర్ణయించుకునే విధంగా విద్యాప్రణాళికలు ఉండాలి. కావున సరికొత్త విధానాన్ని రూపొందించడం కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి మూడునెలల్లో నివేదిక అందేలా, తాజా 2025-26 విద్యా సంవత్సరం నుంచి మార్పులతో మూల్యాంకన విధానాన్ని అమలు చేస్తేనే విద్యార్థులకు చదువు, జీవన భద్రత పెరిగే అవకాశం ఉంటుంది. ●

# ప్రభుత్వానికి గుదిబండగా మారిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి

గుర్రం రాంమోహన్‌రెడ్డి

ఆర్థిక ఇక్కట్లలో తెలంగాణ ప్రభుత్వం కొట్టుమిట్టాడుతుంది. అంతఅంత మాత్రమే ఆదాయం వస్తుండటంతో ఆర్థిక పరిస్థితి గుదిబండగా మారింది. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ, నిర్వహణ భారాన్ని, ఖర్చులను తగ్గించుకొని రూపాయి రూపాయి వడిసి పట్టుకొని ప్రభుత్వాన్ని నడిపిస్తున్నప్పటికీ ఆర్థిక పరిస్థితి మాత్రం మెరుగుపడే పరిస్థితి కనిపించడం లేదు. నెలనెలకు కనీసంగా 25వేల కోట్ల రూపాయల ఆదాయం వస్తే ప్రభుత్వాన్ని విజయవంతంగా నడిపించే అవకాశం ఉంది. ప్రస్తుతం నెలనెలకు కనీసంగా 25వేల కోట్ల రూపాయల ఆదాయం వస్తే ప్రభుత్వాన్ని విజయవంతంగా నడిపించే అవకాశం ఉంది. ప్రస్తుతం నెలనెల సమకూరుతున్న ఆదాయానికి ఖర్చుకు వ్యత్యాసం కనిపిస్తోంది. ఆదాయం కోసం ప్రభుత్వం ఎన్ని మార్గాలను అన్వేషించినప్పటికి ఫలితాలు కనిపించని పరిస్థితినెలకొంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రస్తుతం నెలనెల 18వేల కోట్ల రూపాయలు ఆదాయం సమకూరుతుంది. ఆదాయం మాట ఎలాఉన్నా ఖర్చులు, జీతభత్యాలు, సంక్షేమ పథకాల కోసం వచ్చిన ఆదాయాలఉ ఖర్చు అవుతున్నాయి. ఆర్థిక క్రమశిక్షణ పాటించినప్పటికీ ఎప్పటికీ ఖజానా కాలికుండలా కనిపిస్తుంది. గత ప్రభుత్వం చేసిన అప్పుల వల్ల ప్రస్తుతం ఆర్థికంగా చితికిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం ప్రభుత్వానికి నెలకు వివిధ రకాల రూపేణ 18వేల కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతుంది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం 3.50 లక్షల మంది ఉద్యోగులకు 2.50 లక్షల మంది పైగా పెన్షనర్లకు నెలకు ఆరువేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతుంది. గత ప్రభుత్వం చేసిన అప్పులకు నెలకు ఆరువేల కోట్లు వడ్డీ చెల్లిస్తుండగా, మరో మూడువేల కోట్లు సంక్షేమ పథకాల అమలుకోసం ప్రభుత్వం ఖర్చు చేస్తుంది. మరో మూడువేల కోట్లు ప్రభుత్వ నిర్వహణ, పలు నిర్మాణ పనులకు బిల్లు చెల్లించడం, కొత్తగా రోడ్లు, సాగు, తాగు నీరు పథకాలకు ఖర్చు చేయడంతో ఖజాన పెట్టే ఖాళీఅవుతుంది. ఆదాయం మిగులు మాటఏమోకాని వచ్చిన ఆదాయం కంటే ప్రభుత్వంపై అదనంగా ఆర్థికభారంపడుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దాదాపు పదినెలల కాలంలో వివిధ బ్యాంకులోవివిధ ఆర్థికసంస్థలనుంచి దాదాపు 49వేల కోట్లరూపాయలు రుణాలు తీసుకొని ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల వడ్డీ కింద పదినెలల కాలంలో 60వేల కోట్లరూపాయలు తెలంగాణ ప్రభుత్వం వడ్డీకింద చెల్లించింది. గతప్రభుత్వం రమారమి రూపాయలు ఏడు లక్షలకోట్లు అప్పు చేయగా రోజుకు రూపాయలు 200కోట్లు వడ్డీరూపేణ చెల్లిస్తే నెలకు అక్షరాల ఆరువేల కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వానికి



నాలుగు శాఖలనుంచి మాత్రమే ఆదాయంసమకూరుతుంది. మిగతా శాఖల నుంచి పెద్దగా ఆదాయం సమకూరే పరిస్థితి లేదని చెప్పాలి. అబ్కారిశాఖ, రవాణాశాఖ, స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ, వాణిజ్య పన్నులశాఖ నుంచి మాత్రమే ఆదాయం వస్తుంది. అబ్కారీశాఖకు నెలకు మూడువేల నుంచి 3,500 కోట్లవరకు ఆదాయం సమకూరింది. వాణిజ్య పన్నులశాఖ నుంచి అధికంగా ఆదాయంవచ్చే అవకాశం ఉన్నప్పటికీ రాజకీయ జోక్యంతో పూర్తిస్థాయి పన్నులు వసూలు కావడం లేదు. ప్రభుత్వం నాలుగు శాఖలపై ఆధారపడి వచ్చే ఆదాయంతో ఖర్చు చేస్తున్నప్పటికి రుణాలు తీసుకోవడం అని వార్యమైంది. అన్ని రకాలుగా అన్వేషణ చేస్తున్న ఆదాయ మార్గాలు కన్పించడం లేదు. కేంద్రప్రభుత్వం నుంచి ఆర్థిక సహకారం అంతంతమాత్రమే అని చెప్పాలి. బిజెపి, పాలిత రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం పూర్తిగా ఆర్థిక సహకారం అందిస్తూ, బిజెపి యేతర ప్రభుత్వాలకు ఆర్థిక సహకారం పూర్తిస్థాయిలో అందించడం లేదనిచెప్పాలి. కేంద్రానికి మద్దతు ఇస్తున్న ప్రాంతీయ, జాతీయ పార్టీల ప్రభుత్వాలకు కేంద్రం ఆర్థిక సహకారం అందిస్తుంది. ఇటీవల కేంద్రప్రభుత్వం ఆంధ్రప్రభుత్వానికి 7500కోట్ల రూపాయలు ఆర్థిక సహకారం అందించగా తెలంగాణ ప్రభుత్వానికి 3,800కోట్ల రూపాయలు ఆర్థికసహాయంఅందించింది. 16 సీట్ల టిడిపి కేంద్ర ప్రభుత్వానికి ప్రధాన మద్దతుగా నిలవడంతో ఎపికి అదనంగా కేంద్ర ఆర్థికంగా సహకారం అందిస్తుంది. గూడ్స్ సర్వీస్‌ట్యాక్, జిఎస్టీ పన్ను కింద రావల్సిన వాటాను కేంద్రప్రభుత్వం పూర్తిస్థాయిలో తెలంగాణకు చెల్లించకపోవడం వల్ల సంకటంగా మారింది. గతప్రభుత్వం ప్రభుత్వ భూములు విక్రయించి ఆదాయం సమకూర్చుకుంది. తెలంగాణ ప్రభుత్వం ఆదిశగా అడుగులు వేసేందుకు సుముఖంగా లేనట్టే కన్పిస్తుంది. వచ్చే 18వేల కోట్ల ఆదాయంలో ఆరు వేలకోట్లు జీతాలు, పెన్షన్లు, ఆరువేల కోట్లు వడ్డీలకు చెల్లిస్తుండటంతో ప్రభుత్వానికి ఆర్థికపరిస్థితులు తల నొప్పిగా మారాయి. రైతులకు రైతు భరోసా కింద రెండు విడతలు చెల్లించాలంటే రమారమి రూ.15వేల కోట్లు అవసరం అవుతాయి. విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలకింద మరో ఏడువేల 700 కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉంది. రైతు భరోసాకు 15వేలకోట్లు, ఫీజు రీయిం బర్స్‌మెంట్‌కు 7,700కోట్లు అంటే దాదాపు 23వేల కోట్లు ఇప్పటికే రుణాలుతెచ్చి రైతురుణమాఫీ పథకం కింద రెండు లక్షలరుణాలున్న రైతులకు 20వేలకోట్లు రుణమాఫీ చేసింది. కొత్తగా ప్రభుత్వ ఉద్యోగులుగా చేరుతున్న వారికి అదనంగా వేతనాలు ఇవ్వాల్సి ఉంటుంది. వచ్చే ఆదాయం జీతాలకు, పెన్షన్లకు వడ్డీ చెల్లింపులకు, సంక్షేమ పథకాలకు ఖర్చు అవుతుండడంతో పెండింగ్‌ప్రాజెక్టులు పూర్తిచేయడం కొత్త ప్రాజెక్టుల నిర్మాణం, ఇతరసంక్షేమ పథకాలు రైతు భరోసా, ఫీజు రీయింబర్స్‌మెంట్ మహిళలకు 2500 వంటి పథకం, సంక్షేమ పథకాలు అమలుచేయాలంటే ప్రభుత్వానికి రుణాలు తీసుకోవడం అనివార్యమని చెప్పాలి. ●




## చెన్నపట్టణ ఉప ఎన్నికల్లో జెడిఎస్ అభ్యర్థిగా నిఖిల్‌కుమారస్వామి

### - పేరును కరారు చేసిన దేవెగౌడ

బెంగళూరు,అక్టోబర్ 24,ప్రభాతవార్త ప్రతినిధి


నిఖిల్ పేరును ప్రకటించిన యడ్యూరప్పతో కుమారస్వామి నిఖిల్‌కుమారస్వామి.

రామనగర జిల్లా చెన్నపట్టణ విధానసభ ఉప ఎన్నికల్లో జెడిఎస్ ఎన్డీయే అభ్యర్థిగా మాజీ సిఎం కుమారస్వామి తనయుడు నిఖిల్ కుమారస్వామిని పేరు దళపతి దేవెగౌడ గురువారం మధ్యాహ్నం కరారు చేసి ప్రకటించారు.ఆతరువాత బిజెపి నాయకుడు యడ్యూరప్ప నివాసంలో హాజరైన కుమారస్వామి ఉభయ నాయకులు నిఖిల్ పేరును అధికృతంగా ప్రకటించారు.దీంతో ఈసీటులో నిఖిల్ పోటి గ్యారంటీ అయ్యింది.ఇప్పటివరకు బయటి వారికి చెన్నపట్టణ టిక్కెట్టును ఇస్తారని ప్రచారం జరిగినా కూడా చివరి నిమిషంలో దేవెగౌడ మనవడికి ఈసీటును కేటాయించి కుటుంబ పాలన తప్పనిసరి అనే సందేశాన్ని ఇచ్చారు.ఎన్డీయే తరపున పోటీ చేసేందుకు యోగేశ్వర్ నిరాకరించి కాంగ్రెస్ పార్టీలో చేరటంతో వేరే దారిలేక కుమారస్వామి తన తనయుడిని చెన్నపట్టణ ఉప ఎన్నిక కదనానికి సిద్ధం చేశారు.నిఖిల్ ఇప్పటికే మండ్య లోక్‌సభకు ఒకసారి,రామనగర విధానసభకు ఒకసారి పోటీ చేశారు.ముచ్చటగా మూడోసారి ఈయన తన అదృష్టాన్ని చెన్నపట్టణ ఉప ఎన్నికల సమరం ద్వారా పరీక్షించుకోనున్నారు.

## సండూరు కాంగ్రెస్ అభ్యర్థిగా అన్నపూర్ణ తుకారాం నామినేషన్ దాఖలు

బెంగళూరు,అక్టోబర్ 24,ప్రభాతవార్త ప్రతినిధి


బళ్లారిలో నామినేషన్ వేసిన అన్నపూర్ణ తుకారాం

బళ్లారి జిల్లా సండూరు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా అన్నపూర్ణ తుకారాం పేరును కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన వెంటనే గురువారం బళ్లారిలో ఆమె నామినేషన్ దాఖలుచేశారు.బళ్లారి జిల్లా ఇంఛార్జ్ మంత్రి జమీర్‌అహమద్‌ఖాన్,మాజీ మంత్రి బి.నాగేంద్ర, మరో మంత్రి సంతోష్‌లాడ్ బళ్లారి ఎంపీ తుకారాం వెంటరాగా అన్నపూర్ణ నామినేషన్ వేశారు.ఈమెకు ప్రత్యర్థి బిజెపి నుంచి బంగారుహనుమంతు పోటీలో ఉన్నారు.సండూరు సీటుకు నాలుగుసార్లు తుకారాం గెలిచారు.ఈసీటు కాంగ్రెస్‌పార్టీది.ఈసారి కూడాభారీ మెజారిటీతో గెలుస్తామని మంత్రి సంతోష్‌లాడ్ చెప్పారు.

## చామరాజనగర జిల్లాలో వానలకు నేలకు వంగిన విద్యుత్ తీగలు

### - కరెంటు తీగలు ఇద్దరు వ్యక్తులు మృతి

చామరాజనగర,అక్టోబర్ 24,ప్రభాతవార్త ప్రతినిధి

చామరాజనగరజిల్లా కేంద్రం సమీపంలోని అయ్యనహళ్లి గ్రామంలో గురువారం ఉదయం సంభవించిన రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైకిల్‌పైన వెళుతున్న ఇద్దరు వ్యక్తులు దారిలో గాలివానకు కిందకి వంగిపోయిన కరెంటు తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై స్థలంలో మృతి చెందారు.పోలీసులు తెలిపిన వివరాల మేరకు అయ్యనహళ్లికు చెందిన నాగేంద్ర (52),మహేష్ (47) గురువారం వేకువ జామున తమ ఇంటి నుంచి పనిమీద పొలంగట్టు రహదారిపైన మోటార్‌సైకిల్‌పైన వెళుతుండగా దారిలో రాత్రివీచిన గాలివానకు కరెంటు తీగలు వంగిపోయి రోడ్డుమీదకు జారిపోవటంతో వీటిని గమనించ కుండా బైక్‌ను నడిపిన ఇరువురు వ్యక్తులు కరెంటు షాక్ తగిలి అక్కడికక్కడె మృతి చెందారు. ఈసంఘటన జరిగిన చాలా సేపటికి అదేదారిలో వచ్చిన మరో రైతు తమ గ్రామస్తులు రోడ్డుపైన విగతజీవులుగా పడి ఉండటాన్ని చూసి పరుగులుతీసి గ్రామవాసులకు సమాచారం అందించాడు.వెంటనే అయ్యనహళ్లి గ్రామస్తులు గ్రామంలోని కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్లను బందు చేయించి స్థలానికి వచ్చి ఇద్దరు వ్యక్తుల మృత దేహాలను అక్కడ నుంచి తరలించారు.చాముండేశ్వరీ విద్యుత్ సరఫరా కంపెనీ అధికారులు స్థలానికి వచ్చేవరకు ఇద్దరు వ్యక్తులను బయటకు తరలించబోమంటూ గ్రామస్తులు ఆందోళనకు దిగారు.

## బెంగళూరు కాడుగొడి ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న బిల్డింగ్ లిఫ్ట్‌కోసం తవ్విన స్థలంలో పడిపోయి బాలుడి మృతి

బెంగళూరు,అక్టోబర్ 24,ప్రభాతవార్త ప్రతినిధి

స్థానిక కాడుగొడి ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఒక పెద్ద బిల్డింగ్‌లో లిఫ్ట్‌కోసం నిర్మించిన సొరంగంలో పడిపోయి బాలుడు ఒకడు మృతి చెందాడు.పోలీసులు తెలిపిన వివరాల మేరకు కాడుగొడి ప్రాంతంలో ఆరు అంతస్తుల బిల్డింగ్ నిర్మించేందుకు ఏర్పాటైన లిఫ్ట్ గుంతలో పడిపోయి సుహాస్ గౌడ(7) అనే బాలుడు మృతి చెందాడు.బిల్డింగుపక్కన దాదాపు 30అడుగుల ఎత్తునుంచి చౌక ఆకారంలో నిర్మించిన లిఫ్ట్‌బావిలో ఇటీవల కురిసినభారీ వానలకు పెద్దఎత్తున నీరు చేరుకుంది.ఇవాళ బాలుడు అక్కడ ఆటలాడుతూ అదుపుతప్పి లిఫ్ట్ గుంతలో పడిపోయాడు.ఈ సమయంలో బాలుడి తల్లి తండ్రులు మరోచోట పనిచేస్తుండటంతో బాలుడు వేసిన కేకలు వినిపించలేదు.కొద్దిసేపట్లో బాలుడు అక్కడే మృతి చెందాడు. బిల్డింగ్ ఓనర్ నిర్లక్ష్యం వలన లిఫ్ట్ గుంత జాగా పూడ్చకపోవటమే ప్రమాదానికి కారణమని పోలీసులు చెప్పారు.ఈమేరకు కాడుగొడి స్టేషనులో కేసునమోదు అయ్యింది.

## అక్రమంగా ఇనుపఖనిజాన్ని విదేశాలకు తరలించిన కారవార జెడిఎస్ ఎంఎల్ఏ సతీష్‌సైల్ నిందితుడు

### - బెంగళూరు జనప్రతినిధుల కోర్టు తీర్పు

బెంగళూరు,అక్టోబర్ 24,ప్రభాతవార్త ప్రతినిధి

గతంలో కారవార బెలకేరి బందరులో సర్కారు స్వాధీనం చేసుకున్న 11312 మెట్రిక్‌టన్నుల ఇనుపఖనిజాన్ని అక్రమంగా విదేశాలకు రవాణాచేసి అమ్ముకున్న కారవార కాంగ్రెస్ ఎంఎల్ఏ సతీష్‌సైల్ నిందితుడని బెంగళూరు ప్రజాప్రతినిధులకోర్టు గురువారం ప్రకటించింది. కారవార బందరులో తాము పట్టుకున్న అక్రమ ఇనుపఖనిజాన్ని ఎంఎల్ఏ సతీష్‌సైల్ తన అధికారాన్ని దుర్వినియోగం చేసి విదేశాలకు అక్రమంగా తరలించి అమ్ముకున్నాడని గనులశాఖ ఆరోపించింది.ఈకేసును విచారణ జరిపిన బెంగళూరు ప్రజాప్రతినిధుల నేరాల న్యాయాలయం ఇవాళ తీర్పు నిస్తూ సతీష్‌సైల్ నేరం చేశాడని తెలిపింది.అతడిపైన శిక్ష అమలు గురించి శుక్రవారం ప్రకటిస్తామని కోర్టు పేర్కొంది.బెలకేరి బందరులో సీజ్‌చేసిన ఐరన్‌ఓర్‌ను ఇతడు అక్రమంగా తరలించాడని కోర్టు చెప్పింది.

## ఆరుఅంతస్తుల బిల్డింగ్ కూలిపోయిన దుర్ఘటనలో మృతులకు తలా 5లక్షల పరిహారం ప్రకటించిన సిఎం

బెంగళూరు,అక్టోబర్ 24,ప్రభాతవార్త ప్రతినిధి


బెంగళూరు బాబుసా పాళ్యలో బిల్డింగ్ కూలిన స్థలాన్ని పరిశీలించి మృతులకు పరిహారం ప్రకటించిన సిఎం

బెంగళూరు ఉత్తర ప్రాంతంలో రెండురోజుల కిందట సంభవించిన ఆరుఅంతస్తుల బిల్డింగ్ కూలిపోయిన దుర్ఘటనలో మృతి చెందిన 8మంది కార్మికులకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య తలా 5లక్షల రూపాయల వంతున పరిహారాన్ని ప్రకటించారు. ఆయన గురువారం ఉదయం బాబుసా పాళ్య లో నేలకూలిన బిల్డింగ్ స్థలాన్ని పరిశీలించి మీడియాతో మాట్లాడారు.సదరు బిల్డింగ్ అక్రమ నిర్మాణం అని చెప్పారు.అధికారులు ఈ బిల్డింగ్ కట్టరాదంటూ ఓనరుకు నోటీసులు ఇచ్చినా కూడ అక్రమంగా ఆరు అంతస్తుల కట్టడాన్ని నిర్మించాడని చెప్పారు.ఇలాంటి వారిపైన కఠినచర్యలు తీసుకోవాలని బిబిఎంపి అధికారులకు సిఎం సూచించారు.బిల్డింగ్ బేస్‌మెంటుకు పటిష్టమైన పిల్లర్లు నిర్మించకపోవటం దుర్ఘటనకు కారణమన్నారు.ఇలాంటి నిర్మాణాలను అడ్డుకోని ఇక్కడి జోనల్ ఐఎఎస్ అధికారికి,పాలికె ఛీఫ్ ఇంజనీరుకు తక్షణం నోటీసులు ఇవ్వాలని అధికారులకు సూచించారు. నగరంలో అనధికృతంగా బిల్డింగ్ నిర్మాణాలు చేయవద్దంటూ ప్రజలకు మనవి చేశారు.చట్టబద్ధంగా ఇళ్లు నిర్మించుకోవాలని సిఎం కోరారు.సిఎం వెంట పట్టణాభివృద్ధిశాఖ మంత్రి బైరతి సురేష్,స్థానిక ఎంఎల్ఏ బైరతీ బసవరాజు,బిబిఎంపి కమిషనర్ తుషార్ గిరినాథ్ పాల్గొన్నారు.

## చెన్నపట్టణ ఉప ఎన్నికల్లో నామినేషన్ వేసిన కాంగ్రెస్ అభ్యర్థి యోగేశ్వర్

### - సిఎం,డిసిఎం హాజరు

చెన్నపట్టణ (రామనగరజిల్లా ).అక్టోబర్ 24,ప్రభాతవార్త ప్రతినిధి


చెన్నపట్టణ ఎన్నికల్లో నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్‌అభ్యర్థి యోగేశ్వర్

చెన్నపట్టణ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సి.పి.యోగేశ్వర్ గురువారం మధ్యాహ్నం నామినేషన్ వేశారు. నామినేషన్ వేసే ముందు చెన్నపట్టణలో భారీఎత్తున అభిమానులు వెంట రాగా ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఉపముఖ్యమంత్రి డికె.శివకుమార్ లతో కలసి రోడ్డుషో జరిపి చెన్నపట్టణ తహశీల్దార్‌కు నామినేషన్ పత్రాలు సమర్పించారు.అంతకుముందు జరిగిన కార్యక్రమంలో సిఎం సిద్దరామయ్య మాట్లాడుతూ చెన్నపట్టణ కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు గ్యారంటీ అని చెప్పారు.ఈయన మాజీ కాంగ్రెస్‌వాది.గతంలో అయిదుసార్లు ఎంఎల్ఏగా గెలిచారు.ఇపుడు కాంగ్రెస్ నుంచి పోటీకి దిగారు.చెన్నపట్టణ తాలూకాలోని అన్నిగ్రామాల్లో యోగేశ్వర్ అభిమానులు ఈసారి భారీ మెజారిటీతో యోగేశ్వర్‌ను గెలిపించాలని మనవి చేశారు.చెన్నపట్టణ తాలూకా అభివృద్ధి కోసం సర్కారు 500కోట్ల రూపాయల పనులను ప్రారంభించింది.వీటిని సకాలంలో పూర్తిచేయాలంటే యోగేశ్వర్‌ను ఓటర్లు గెలిపించి తీరాలని కోరారు.బెంగళూరు నగరంలో బెంగళూరు దక్షిణజిల్లాలో భాగమైన చెన్నపట్టణ తాలూకాను వచ్చే రోజుల్లో కాంగ్రెస్‌పార్టీ మరింతగా అభివృద్ధి చేయనుందని అన్నారు.గతంలో రెండు సార్లు ఇక్కడనుంచి గెలిచిన జనతాదళ్ ఎస్ అభ్యర్థి కుమారస్వామి చెన్నపట్టణను పట్టించుకోలేదన్నారు.ఈ ప్రాంతానికి వైభవం తేవాలంటే కాంగ్రెస్‌కు ఓటేయాలని కోరారు.యోగేశ్వర్ తన అఫిడవిట్‌లో 70కోట్ల రూపాయల ఆస్తిదారుడని ప్రకటించుకున్నారు.

## బెంగళూరు దక్షిణ ప్రాంతానికి రెండో ఇంటర్నేషనల్ ఏర్‌పోర్ట్ నిర్మించండి

### - సర్కారుకు పలువురు ఎంఎల్ఏల మనవి




బెంగళూరు,అక్టోబర్ 24,ప్రభాతవార్త ప్రతినిధి

బెంగళూరు నగరానికి రెండు అంతర్జాతీయ విమానాశ్రయాల అవసరం ఉందని పలువురు కాంగ్రెస్ ఎంఎల్ఏలు చెప్పారు.ఈమేరకు గురువారం కాంగ్రెస్ ఎంఎల్ఏలు సిఎం సిద్దరామయ్యకు ఉపముఖ్యమంత్రి డికె.శివకుమార్ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబి పాటిల్‌కు మనవి చేశారు. వచ్చే కెబినెట్ సమావేశంలో బెంగళూరు దక్షిణ ప్రాంతంలో విమానాశ్రయం నిర్మించేందుకు చర్చలు జరిపి తీర్మానం చేయాలని కోరారు.కాంగ్రెస్ ఎంఎల్ఏలు ఇక్బాల్ హుసేన్,మాగడి హెచ్‌సి.బాలకృష్ణ,మద్దూరు ఎంఎల్ఏ కదలూరు ఉదయ్‌గౌడ,శ్రీరంగపట్టణ ఎంఎల్ఏ రమేష్ బండిసిద్దేగౌడ, పి.రవికుమార్,శివణ్ణ,దినేష్ గూళిగౌడ,పుట్టణ్ణ,మండ్య కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి స్టార్ చంద్రు సిఎంకు మనవి చేశారు.ఇపుడు బెంగళూరు ఉత్తర భాగంలోని ఉన్న దేవనహళ్లి ఏర్‌పోర్ట్‌కు బెంగళూరు దక్షిణభాగంలోని ప్రయాణీకులే పెద్దసంఖ్యలో వెళుతున్నారు.దీంతో ట్రాఫిక్ సమస్యలు విమానాలను క్యాచ్ చేయటంలో జాప్యం జరుగుతుందని వారు చెప్పారు. బెంగళూరు దక్షిణ ఏరియాలోని ఎలక్ట్రానిక్ సిటి,బొమ్మనహళ్లి, బన్నేరుఘట్ట,జయనగర,జేపి నగర,కనకపురరోడ్డు మైసూరు రోడ్డు మాగడిరోడ్డు ప్రాంతాల ప్రయాణీకులు పెద్ద సంఖ్యలో నిత్యం వెళ్లడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు.సర్కారు దీనిని గమనించి మైసూరు రోడ్డు లేదా కనకపుర రోడ్డులో కొత్త అంతర్జాతీయ విమానాశ్రయానికి శంకుస్థాపన చేస్తే చాలా మటుకు సమస్యలు పరిహారం అవుతాయని చెప్పారు.సిఎం వచ్చే కెబినెట్లో రెండో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి సంబంధించి ఒక నిర్ణయం తీసుకోవాలని మనవిచేశారు.

## అప్పులబాధకు రైతు ఆత్మహత్య

బీదర్,అక్టోబర్ 24,ప్రభాతవార్త ప్రతినిధి

బీదర్ తాలూకాలో గురువారం ఒక రైతు అప్పులబాధకు ఆత్మహత్య చేసుకున్న విషాద సంఘటన వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బీదర్ తాలూకాలోని మేగలకేరి గ్రామానికి చెందిన శివకుమార సంగనబసప్ప చెన్నబసప్ప అనే రైతు తన పంటల సాగు కోసం అక్కడి డిసిసి బ్యాంకు నుంచి 4లక్షల రూపాయల మేరకు అప్పు చేశాడు.సకాలంలో పంటలు చేతికి అందక వానలకు పంట నాశనమై పోవటంతో అప్పులు తీర్చే దారిలేక గురువారం ఉదయం తన పొలంలో రైతుపురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.ఇటీవల సదరు డిసిసి బ్యాంకు ఈ రైతుకు వెంటనే పాత బకాయిలు చెల్లించాలని లేదంటే జప్తు చేస్తామని నోటీసులు ఇవ్వటంతో రైతుకు వేరేదారిలేక తన జీవితాన్ని కడతేర్చుకున్నాడు.

## ముడాకేసు దర్యాప్తుకు ఆదేశించిన సింగిల్‌జడ్జి ఆదేశాలను రద్దు చేయాలంటూ హైకోర్టు డివిజన్‌బెంచ్‌కు సిఎం అప్పీల్ పిటీషన్

బెంగళూరు,అక్టోబర్ 24,ప్రభాతవార్త ప్రతినిధి

మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార కేసులో తనమీద దర్యాప్తునకు ఆదేశించిన హైకోర్టు ఏకసభ్యుడి పీఠం తీర్పును రద్దు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి సిద్దరామయ్య గురువారం హైకోర్టు డివిజన్‌బెంచ్‌కు అప్పీల్ చేసుకున్నారు.ఈమేరకు డివిజన్‌బెంచ్‌కు పిటీషన్ పెట్టుకున్నారు. ముడా స్కాంలో తనపేరు అనవసరంగా ఇరికించి ఇబ్బందులు పాలుచేశారని ఆరోపించారు.బిజెపి సర్కారు ముడా సైట్లు పంపిణి చేసి వారే నామీద ఆరోపణలు చేస్తున్నారు.ఈకేసులో బిజెపి నాయకుల కుట్ర కనిపిస్తోంది.నా కుటుంబానికి ముడా మంజూరు చేసిన నివేశనాలను వాపస్ చేశాము.ఇక నామీద ఆరోపణలు చేసి ఏమి ప్రయోజనం ఉందో చెప్పాలని హైకోర్టును కోరారు.ఇది పక్కా రాజకీయప్రేరితమైన కేసు దీంట్లో నాపాత్ర లేనేలేదు.కేంద్రసర్కారు కుమ్మక్కుతో ఇక్కడి గవర్నర్ తాబేదారిగా పనిచేసి నామీద ప్రాసిక్యూషన్‌కు ఆదేశించారు.ఇది చట్టరీత్యా సరైన చర్యకాదని సిఎం తన పిటీషన్‌లో పేర్కొన్నారు.నాకు వ్యతిరేకంగా జరిగిన కుట్ర అని అపాదించారు.ఈకేసును రద్దుచేసి ఏకసభ్యుడి ధర్మాసనం ఇచ్చిన తీర్పు స్క్వాష్ చేయాలని మనవి చేశారు.

## శిగ్గావి ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా యాసిర్ అహమద్‌ఖాన్ పేరు ప్రకటించిన ఏఐసిసి

శిగ్గావి (హావేరి జిల్లా ),అక్టోబర్ 24,ప్రభాతవార్త ప్రతినిధి

మధ్యకర్ణాటక ప్రాంతంలోని హావేరిజిల్లా శిగ్గావి విధానసభ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గురువారం సాయంత్రం తన అభ్యర్థిని ప్రకటించింది.శిగ్గావి సీటుకు యాసిర్ అహమద్‌ఖాన్ పఠాణ్ పేరును ఏఐసిసి ప్రధానకార్యదర్శి కెసి.వేణుగోపాల్ ప్రకటించారు.ఈ నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో మైనారిటీ ఓట్లు ఉండటంతో కాంగ్రెస్‌పార్టీ మైనారిటీ అభ్యర్థిని నిలబెట్టింది.గతంలో ఇక్కడ మైనారిటీ అభ్యర్థులే పోటీ చేస్తూ వచ్చారు.కాగా ఇవాళ బిజెపి అభ్యర్థి భరత్ బొమ్మాయి కొంతమంది అనుచరులు వెంటరాగా తహశీల్దార్ కు నామినేషన్ పత్రాలు సమర్పించారు.

## నవంబర్ 27 నుంచి 30 వరకు ఏఐఎస్ఎఫ్ 49 రాష్ట్ర మహాసభలు

### - హలో విద్యార్థి ఛలో విజయనగరం కరపత్రాలు విడుదల చేసిన ఏఐఎస్ఎఫ్


ఉరవకొండ, అక్టోబర్ 24 ప్రభాతవార్త


కరపత్రాలు విడుదల చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

నవంబర్ 27 నుంచి 30 వరకు ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలు విజయనగరంలో జరుగుతాయని విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు హనుమంతరాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి చందు, నియోజకవర్గ అధ్యక్షులు హారున్‌రషీద్, కోశాధికారి రాజు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో గురువారం వారు విద్యార్థులతో కలసి హలో విద్యార్థి ఛలో విజయనగరం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా నేడు ఉద్యమాలను శ్రీకారం చుడుతున్నామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతోందన్నారు. కేంద్రం వెంటనే జాతీయ నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని, ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల్లో విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, యువగళం పాదయాత్రలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హామీ మేరకు జూనియర్ కళాశాలల్లో మధ్యాన్న భోజన కార్యక్రమాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉన్నత చదువులకు శాపంగా మారిన జీఓ నంబర్ 77ను రద్దు చేయాలని, వైద్య విద్యను ప్రైవేటీకరణ చేసే జీఓలు 107, 108ను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఖాళీగావున్న బోధన, బోధనేతర పోస్టులను భర్తీ చేయాలని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ హాస్టళ్ళలో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను 2,500 రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో చెరువులును తలపిస్తున్న ప్రధానరహదారి

పుట్టపర్తి టౌన్ అక్టోబర్ 24 ప్రభాతవార్త


పెద్ద పెద్ద గుంతలు ఏర్పడిన ప్రధాన రహదారి

పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు పెద్ద కమ్మవారిపల్లి 19వ వార్డు సూపర్‌స్పెషాలిటీ వెళ్లె ప్రధాన రహదారి గుంతు ల మయంగా ఏర్పడింది.గురువారం స్థానికులు మాట్లాడుతూ ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోలేదని ప్రస్తుత వర్షాలుకాలంలో పెద్దపెద్ద గోతులు ఏర్పడి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదువుతున్నాయి అన్నారు.పుట్టపర్తి ప్రశాంతి నిలయానికి వచ్చే భక్తులు వెనకవైపు ఉన్న వేస్ట్ గెట్ నుండి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి వెళ్లెందుకు భక్తులు ఇదే దారి గుండా ప్రయాణిస్తూరని తెలిపారు.మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో స్థానిక శాసన సభ్యులరాలు పల్లె సింధూర రెడ్డి దృష్టికి కూడా ఈ విషయం తీసుకెళ్లినట్లు తెలిపారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ రహదారి మరమ్మతులు చేయాలని కోరుతున్నామన్నారు.

## రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్‌కు మెడల్ స్కూల్ విద్యార్థి ఎంపిక

కనగానపల్లి, అక్టోబర్ 24 ప్రభాతవార్త


విద్యార్థితో మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రవికిరణ్

మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థి రైఫిల్ షూటింగ్‌లో అత్యంత ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రవి కిరణ్ తెలిపారు. విద్యార్థి జశ్వంత్ జిల్లా స్థాయిలో రెండవ ర్యాంక్ సాధించాడని అలాగే 150 పాయింట్లుగాను 77, పాయింట్లు సాధించాడని ఆయన తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి జశ్వంత్‌ను పిఈటి మాధవరాజు, ఉపాధ్యాయులు ఆంజినేయులు, బాబ్జాన్ తదితరులు అభినందించారు.

## సీజినల్ వ్యాధులపట్ల ప్రజలకు అవగాహన కల్పించండి

### - ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణస్వామి

### - రాకెట్ల, పి.కౌకుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆకస్మిక తనిఖీ

ఉరవకొండ, అక్టోబర్ 24 ప్రభాతవార్త


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణస్వామి

సీజినల్ వ్యాధులపట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణస్వామి సూచించారు. గురువారం ఆయన మండల పరిధిలోని రాకెట్ల, వి.కౌకుంట్ల పీహెచ్‌సీలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వైద్యులు, వైద్య సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. సీజినల్ వ్యాధులు, నివారణోపాయాల గురించి విస్తృతం ప్రచారం కల్పించాలని, అయోడిన్ లోపంవల్ల కలిగే దుష్పరిణామాలను వివరించే వాల్ పోస్టర్లను విడుదలచేసి సిబ్బందికి కరపత్రాలు అందించారు. వివిధ యాప్‌లలో నమోదు వివరాలను పరిశీలించిన ఆయన రాబోయే ఎంసిడి 3.0 క్యాన్సర్ సర్వే, స్కూల్ హెల్త్ స్టూడెంట్ సర్వేకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పీహెచ్‌సీల్లో ప్రసవాలు పెరగాలని ఆదేశించారు. అనంతరం ఆయన రాకెట్లలోని జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రత, సమతుల ఆహారం, పరిశుభ్రమైన తాగునీరు, నులిపురుగల నివారణ, మధ్యాన్న భోజన పథకం లక్ష్యం, అయోడిన్ ఉప్పు వాడకం ద్వారా కలిగే ప్రయోజనం, బాల్య వివాహాలవల్ల కలిగే దుష్పరిణామాల గూర్చి వివరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో రాకెట్ల పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ వెంకటేష్‌నాయక్, మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి, ఆరోగ్య విస్తరణ అధికారి నాగరంగయ్య, హెల్త్ సూపర్‌వైజర్ శేఖర్, స్వర్ణలత, పి.కౌకుంట్ల పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

**పి.కౌకుంట్ల పీహెచ్‌సీలో కనిపించని వైద్యులు :** పి.కౌకుంట్ల పీహెచ్‌సీను ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణస్వామి తనిఖీకు వెళ్లిన సమయంలో పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు డాక్టర్ అనికేత్, డాక్టర్ లక్ష్మి చందన అందుబాటులో లేకపోవడం విశేషం. దీంతో ఆయన అసహనం వ్యక్తంచేసినట్లు సమాచారం. దీంతో వైద్యులకుఫోన్‌చేసి ఎక్కడు న్నారని ప్రశ్నించినట్లు తెలిసింది. అయితే పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు అందుబాటులో లేకపోయినా 134 మంది రోగులకు ఓపీ వైద్య సేవలు అందించినట్లు రిజిస్టర్‌లో నమోదు చేసినట్లు ఆయన గుర్తించి అవాక్కయ్యారు. మంత్రి సొంత నియోజకవర్గంతోపాటు సొంత గ్రామంలో ఇలాగేనా పనిచేయడమని సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల హిందీ అధ్యాపకురాలు ఎస్.షానవాజ్ బేగంకు డాక్టరేట్

### -19న చెన్నైలో ప్రధాన చేసిన అమెరికన్ గ్లోబల్ యూనివర్సిటీ

ఉరవకొండ, అక్టోబర్ 24 ప్రభాతవార్త



గౌరవ డాక్టరేట్ అందుకొంటున్న హిందీ అధ్యాపకురాలు ఎస్.షానవాజ్ బేగం

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిందీ అధ్యావకురాలిగా విధులు నిర్వహిస్తున్న ఎస్.షానవాజ్ బేగం గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఈనెల 19న తమిళ నాడు రాష్ట్రంలోని చెన్నై నగరంలోని సిగరం ఆడిటోరియం లో జరిగిన కార్యక్రమంలో అమెరికన్ గ్లోబల్ యూనివర్సిటీ మహా ఫైన్ ఆర్ట్స్ సెక్రెటరీ డా॥అనురాధ జయరామ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మద్రాసు హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి కె.జ్ఞానప్రకాశం, డా॥ ప్రొతిమ మధు క్రిష్ణ, డా॥ బాలక్రిష్ణ నాయర్, డాక్టర్ నల్లయి సౌందరరాజన్, డా॥ ఎన్.ఆర్.చంద్రశేఖరన్, డా॥ వెంకటేసన్ చేతుల మీదుగా డాక్టరేట్‌ను అందుకున్నారు. హిందీ భాష అభివృద్ధికి చేస్తున్న కృషికిగాను ఎస్.షానవాజ్ బేగంకు గౌరవ డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డాక్టరేట్ పొందడం ఎంతో ఆనందంగా ఉండటమే కాకుండా మరింత బాధ్యతను పెంచిందన్నారు. ఈ సందర్భంగా ఆమె తన తల్లిదండ్రులు హాజీ ఎస్.ఎ.ఖాధర్, రషీద ఖౌతున్‌లకు, డాక్టరేట్ ప్రధానం చేసిన అమెరికన్ గ్లోబల్ యూనివర్సిటీకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## 27 నుంచి నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉరగాద్రి బాలోత్సవం

### -ఎంఈఓచే కరపత్రాలు విడుదల చేసిన ఫౌండేషన్ ప్రతినిధులు

ఉరవకొండ, అక్టోబర్ 24 ప్రభాతవార్త


బాలోత్సవం కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

నవంబర్ 14న జరిగే జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీ నుండి నవంబర్ 10 వరకు ప్రతి ఆది, రెండవ శనివారాల్లో ఉరవకొండ పట్టణంలోని కరిబసవస్వామి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉరగాద్రి బాలోత్సవాల పోటీలను నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు తాటికొండ వెంకట్ తెలిపారు. గురువారం బాలోత్సవాల కరపత్రాలను మండల విద్యాధికారి హెచ్.ఈశ్వరప్ప చేతుల మీదుగా ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా తాటికొండ వెంకట్ మాట్లాడుతూ పోటీలు రెండు విభాగాలుగా జరుగుతాయని ఎల్-1 జూనియర్స్ విభాగంలో 4,5,6 తరగతులు, ఎల్-2 సీనియర్స్ విభాగంలో 7,8,9 తరగతుల విద్యార్థులకు పోటీలు ఉంటాయన్నారు. ఈనెల 27న ఆదివారం ఉదయం 10 గంటలకు పేపర్ క్రాఫ్ట్, బెస్ట్ ఫ్రమ్ వేస్ట్, స్కిప్పింగ్, రంగోలి ఆన్ పేపర్ అంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. నవంబర్ 3న ఆదివారం డ్రాయింగ్, జనరల్ క్విజ్, చెస్, పబ్లిక్ స్పీకింగ్ అంశాల్లోనూ, 9న శనివారం సింగింగ్, డ్యాన్సింగ్, స్కిట్, ఇండియన్ ట్రెడిషనల్ డ్రెస్సింగ్ అంశాల్లోనూ, 10నఆదివారం నీతిపద్యాలు-భావం,సంస్కృత శ్లోకం-భావం, కథ చెప్పడం, ఏకపాత్రాభినయం, ఉత్తమ విద్యార్థి అవార్డు, ముఖాభినయం అంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. పోటీల్లో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ విజేతలకు జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను నవంబర్ 14న షిరిడిసాయి బాబా మందిరం ప్రాంగణంలో సాయంత్రం 5 గంటలకు జరిగే బాలల దినోత్సవంలో ప్రధానం చేయడం జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు సమన్వయకర్తలు సునీతరెడ్డి సెల్: 93914 26177, శ్రీనివాసులు సెల్ 9476 94992కు సంప్రదించాలని తాటికొండ వెంకట్ వివరించారు.

## ఉచిత కంటి వైద్య శిభిరాన్ని సద్వినియోగం చేసుకోండి

గుడిబండ, అక్టోబర్ 24 ప్రభాతవార్త

మండల కేంద్రంలో ఈనెల 26వ తేది శనివారం నిర్వహించే ఉచిత కంటి వైద్య శిభిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని గుడిబండ ఎస్ఐ మునిప్రతాప్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా శంకర్ కంటి ఆసుపత్రి సహకారంతో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఉచిత కంటి వైద్య శిభిరాన్ని ఏర్పాటు చేయడమైందని కావున మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించి కళ్లజోడు అందిస్తామని తెలిపారు.

# ఆదాయం పెరుగుదలపై ప్రత్యేక దృష్టి

**- స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ డీఐజీ పి.విజయలక్ష్మి**

**- సెప్టెంబర్ నెల వరకు రూ.19.49 కోట్ల ఆదాయం**

ఉరవకొండ, అక్టోబర్ 24 ప్రభాతవార్త



విలేఖరులతో మాట్లాడుతున్న స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ డీఐజీ పి.విజయలక్ష్మి

రిజిస్ట్రేషన్ల, స్టాంపుల విక్రయం ద్వారా ఆదాయం పెరుగుదలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడం జరిగిందని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ డీఐజీ పి.విజయలక్ష్మి అన్నారు. గురువారం డీఐజీ ఉరవకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంను తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేసిన అనంతరం తనను కలిసిన విలేఖరులతో మాట్లాడారు. విజయలక్ష్మి మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో సెప్టెంబర్ నెల వరకు 19.49 కోట్ల రూపాయల ఆదాయం సమకూరిందన్నారు. అనంతపురం జిల్లాలో 56.35 కోట్ల రూపాయల వార్షిక ఆదాయం లక్ష్యంగా పెట్టుకోగా సెప్టెంబర్ వరకు 23.03 కోట్ల లక్ష్యానికిగాను 11.34 కోట్లు (48.51శాతం) ఆదాయం సమకూరిందన్నారు. సత్యసాయి జిల్లాలో వార్షిక ఆదాయం 29.82 కోట్ల రూపాయలు లక్ష్యంగా పెట్టుకోగా సెప్టెంబర్ నెల వరకు 12.03 కోట్ల లక్ష్యానికిగాను 8.15 కోట్లు (65.91శాతం) ఆదాయం సమకూరిందన్నారు. నాన్‌జ్యుడీషియల్ స్టాంపులకోసం ఇండెంట్ పంపామని నవంబర్ మొదటి వారంలో వస్తాయన్నారు. ప్రస్తుతానికి ఈ స్టాంపింగ్ విధానంలో కొనగోలు చేసుకోవచ్చని సూచించారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్ హనుమానాయక్‌తో పలు అంశాలపై చర్చించారు.

# రైతు సేవా కేంద్రానికి అడ్డుగా సబ్ రిజిస్ట్రార్ కారు..!

**- ఇబ్బందులు పడుతున్న సిబ్బంది, రైతులు**

ఉరవకొండ, అక్టోబర్ 24 ప్రభాతవార్త



ఉరవకొండ ఆర్‌ఎస్‌కే ద్వారం ముందు నిలిపి ఉంచిన సబ్ రిజిస్ట్రార్ కారు

పట్టణంలోని స్త్రీ, శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు కార్యాలయంవద్ద గల రైతు సేవా కేంద్రానికి (ఆర్‌ఎస్‌కే) అడ్డంగా సబ్ రిజిస్ట్రార్ తన కారును నిలుపుతుండటం విమర్శలకు తావిస్తోంది. తన కార్యాలయం వద్ద కారును నిలుపుకోవడానికి బోలెడు స్థలం ఉన్నా ఆయన ప్రతిరోజూ తన కారును రైతు సేవా కేంద్రం ప్రధాన ద్వారం ముందు నిలిపి సాయంత్రం విధులు ముగించుకొని ఇంటికి వెళ్లే సమయంలో తీసుకొని వెళుతున్నారు. దీంతో రైతు సేవా కేంద్రం సిబ్బందితోపాటు వివిధ పనుల కోసం వచ్చే రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రైతు సేవా కేంద్రం ముందు కారు నిలిపి ఉంచుతుండటంవల్ల కార్యాలయం తెరిచి ఉందో లేదో కూడా తెలియని పరిస్థితులు ఏర్పడుతున్నాయని రైతులు వాపోతున్నారు. నిత్యం రద్దీగా ఉంటే ఆర్‌ఎస్‌కేకు అడ్డంగా కారును నిలిపి ఉంచడం సరైంది కాదని పలువురు విమర్శిస్తున్నారు.

# విద్యార్థులకు, పోలియో, సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం

చెన్నేకొత్తపల్లి, అక్టోబర్ 24 ప్రభాతవార్త



సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్న హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు

మండల పరిధిలోని, కనుముక్కల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో, ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రస్తుతం భారీ వర్షాలు, ఎక్కువగా వస్తుండటంతో గ్రామాలలో నీరు ఎక్కువ నిల్వ ఉండటంతో దోమలు ఎక్కువగా వృద్ధి చెందుతాయి. క ఆవున ప్రజలు వీటి వల్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రతి ఒక్కరు దోమతెర, వాడవలెను అని దోమలు కుట్టకుండా తగు జాగ్రత్త తీసుకోవాలన్నారు. వీటివల్ల, జ్వరాలు, దగ్గు, జలుబు, విరేచనాలు ఎక్కువగా వస్తాయని చాలా జాగ్రత్తగా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ సౌందర్య, హెచ్ఎ.శ్రీనివాసులు, ఏఎన్ఎం సునీత, ఆశ సరస్వతి, ప్రధానోపాధ్యాయురాలు పార్వతి, స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

# 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**- పోస్టర్లను ఆవిష్కరించిన పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ జి.వెంకటేష్**



21వ అఖిల భారత పశు గణన పోస్టర్లను విడుదల చేస్తున్న పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ జి.వెంకటేష్

ఉరవకొండ, అక్టోబర్ 24 ప్రభాతవార్త

ఈనెల 25వ తేదీ (నేటి) నుండి ప్రారంభమయ్యే 21వ అఖిల భారత పశుగణన కార్య క్రమాన్ని విజయ వంతం చేయాలని పశుసంవర్ధకశాఖ ఉరవకొండ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.వెంకటేష్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన పట్టణంలోని తన కార్యాలయంలో సిబ్బందితో కలిసి పశు గణన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.వెంకటేష్ మాట్లాడుతూ పశుగణన వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు కొనసాగుతుందన్నారు. సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పశువుల సమగ్ర సమాచారాన్ని తెలుసుకుంటారన్నారు. ఇంటికి వచ్చే విషయ సేకరణదారులకు తమ పశువుల సమగ్ర సమాచారాన్ని అందించాలని కోరారు. తద్వారా పశుగణన రంగ పథకాల రూపకల్పనకు సహకరించాలన్నారు.

# రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు పిసిఎంఆర్ పాఠశాల విద్యార్థి ఎంపిక

ధర్మవరం రూరల్, అక్టోబర్ 24 ప్రభాతవార్త



ఎంపికైన విద్యార్థి గ్రంథే వెంకట అభిషేక్

మండల పరిధిలోగల పిసిఎంఆర్ పాఠశాల నుంచి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అనంతపురం నిరన్వహించిన అండర్-17 హాకీ పోటీలలో రూపా రాజా పిసి ఎంఆర్ పాఠశాల విద్యార్థి గ్రంథే వెంకట అభిషేక్(10వ తరగతి) ప్రతిభ కనబర్చిన, నెల్లూరులో నవంబర్ 3 నుంచి జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు అనంతపురం జట్టు తరపున ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్ హాకీ పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రూప రాజా కృష్ణ, జగదీష్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నరేష్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# పశువులను సొంత స్థలాలకు తరలించుకోకుంటే చర్యలు

**- పట్టణంలో మైకు ద్వారా మేజర్ గ్రామ పంచాయతీ హెచ్చరిక**



ఉరవకొండలో మేజర్ పంచాయతీ ఆధ్వర్యంలో మైకు ద్వారా ప్రచారం చేస్తున్న దృశ్యం

ఉరవకొండ, అక్టోబర్ 24 ప్రభాతవార్త

పశువుల యజమానులు తమ పశువులను మూడు రోజులలోపు సొంత స్థలాలకు తరలించుకోకపోతే పంచాయతీరాజ్ చట్టం 1994 ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఏ.గౌస్‌సాహెబ్ పేర్కొన్నారు. గురువారం ఈ మేరకు పట్టణంలో మైకు ద్వారా హెచ్చరికల ప్రకటనను ప్రచారం చేయించారు. పశువులను రోడ్లపైకి వదలడం ద్వారా వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పశువుల యజమానులు స్పందించకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంతోపాటు పశువులను గోశాలలకు తరలించడం జరుగుతుందని స్పష్టం చేశారు.

# ఎడతెరిపి లేని వర్షానికి నిండుగా పారుతున్న కట్టు కాలువ



కట్టు కాలువ అగళిచెరువులోకి వస్తున్న దృశ్యం

అగళి, అక్టోబర్ 24 ప్రభాతవార్త

ఎడతెరిపి లేకుండా ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షానికి సువర్ణముఖినది హొసహళ్లి వద్ద రెండు పాయలుగా చీలి అందులో కట్టుకాలువ ద్వారా అగళి చెరువులోకి పుష్కలంగా నీరు చేరుతోంది. సువర్ణముఖి నది అగళి మండలంలో దాదాపు 7 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. సువర్ణముఖి నది పారితే బోర్లలో నీటి మట్టం పెరిగి రైతులు సంతోషంగా ఉంటారు. సువర్ణముఖి నది ఒక భాగం నీళ్లు కట్టు కాలువ ద్వారా అగళి చెరువులోకి నిండుగా ప్రవహిస్తోంది. కట్టుకాలువ నీళ్లు రావడంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. కొత్త నీటికి చేపలు, విరివిగా కాలువలో వస్తున్నాయి. రైతులు ఒకపక్క నీళ్లు చూసి సంతోషిస్తున్నారు. గత వారం రోజులుగా అగళి చెరువు కట్టు కాలువ ద్వారా కొత్తగా నీరు వస్తున్నందున కొత్త నీటికి చేపలు ఆకర్షణ పొందుతున్నాయి. కొత్తనీటి పక్క చేపలు రావడంతో ఒక పక్క నీళ్లు రావడం, మరోపొక్క చేపలు పట్టుకుని రైతులు యువత సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# ఘనంగా పవన్‌కుమార్‌గౌడ్ జన్మదిన వేడుకలు

గుంతకల్లు, అక్టోబర్ 24 ప్రభాతవార్త



అభిమానుల మధ్య సంబరాలు చేసుకుంటున్న దృశ్యం

టిడిపి రాష్ట్ర బిసి సెల్ అధికారప్రతినిధి, యువనాయకులు పవన్‌కుమార్‌గౌడ్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీచౌక్ వద్ద పార్టీ కార్యకర్తలు, అభిమానుల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా అభిమానులు ఆయనను గజమాలతో సత్కరించారు. అదేవిధంగా పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంకుమార్‌గౌడ్ జన్మదిన వేడుకలకు హాజరై పవన్‌కుమార్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేశప్ప, యువనాయకులు అనిల్‌కుమార్‌గౌడ్, సీనియర్ నాయకులు అమ్లేట్ మస్తాన్, కురుబ చంద్రశేఖర్, హనుమంతు, ముక్కన్నగారి రామాంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటివైద్య శిబిరం

గుంతకల్లు, అక్టోబర్ 24 ప్రభాతవార్త



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మండలంలోని కసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాము ఐ కేర్, ఆప్టికల్స్ వారి సహకారంతో గురువారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. రాము ఐ కేర్ అధినేత లయన్ దినేష్ 220 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 12 మంది విద్యార్థులకు కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు చక్కా జగన్‌మోహన్, కృష్ణ, ఖాజా, తదితరులు పాల్గొన్నారు.

# బెస్ట్‌లో బెస్ట్ రిజల్ట్..టమోటా చెట్టుకు వంకాయలు

**-బెస్ట్ యూనివర్సిటీ అగ్రికల్చర్ స్టూడెంట్ సృష్టి..బ్రిమాటో ప్రాజెక్ట్‌లో బెస్ట్ రిజల్ట్**

గోరంట్ల, అక్టోబర్ 24 ప్రభాతవార్త



టమోటా చెట్టుకు వంకాయలు కాసిన దృశ్యం

మండలంలోని బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీలో అగ్రికల్చర్ విద్యార్థులు చూపిన ప్రతిభ వావ్ అనిపించేలా వున్నాయి. ఇందుకు నిదర్శనమే టమోటా చెట్టుకు టమోటాతో పాటు వంకాయలు కాసే విధంగా టమోటా చెట్టుకు వంకాయ కొమ్మను గ్రాపింగ్ చేసి ఒకే చెట్ట రెండు రకాల కాయలు కాసే విధంగా సఫలీకృతం కావడంతో బెస్ట్ యూనివర్సిటీ విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. అగ్రికల్చర్ వింగ్ డీన్ రామ్‌గోపాల్‌మోపూరి కో ఆర్డినేటర్‌గా విద్యార్థులు బ్రీమాటో ప్రాజెక్ట్‌పై దృష్టి సారించి చేసిన పరిశోధనలు విజయవంతమయ్యాయి. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వెజిటబుల్ రీసెర్స్ నుండి అవగాహన పొందిన విద్యార్థులు ఈ పరిశోధనాత్మక ఫలితాల్లో సక్సెస్ అయ్యారు. ఏడాది జూలై, సెప్టెంబర్ మధ్య నిర్వహించిన ఈ ప్రయోగంలో టమోటో హైబ్రిడ్ 448కు వంకాయ హైబ్రిడ్ విఎన్ఆర్ సీమ్రాన్ రకానికి చెందిన కాండంతో టమోటా చెట్టుకు గ్రాపింగ్ చేయడం జరిగింది. టమోటా చెట్టుపై చేసిన ప్రయోగం సక్సెస్ అవుతూ ఒకే చెట్టులో ఒకవైపు టమోటా, మరోవైపు వంకాయలు దిగుబడి రావడంతో విద్యార్థుల ప్రతిభ అబ్బురపరిచింది. యూనివర్సిటీ ఆవరణలోని వ్యవసాయ క్షేత్రంలో విద్యార్థులు ఈ ప్రయోగాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీన్‌రాంగోపాల్, డాక్టర్ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# గుడిలో హుండీ చోరీ

గుత్తి, అక్టోబర్ 24 ప్రభాతవార్త



చోరీ జరిగిన దృశ్యం

మండలంలోని రాజుపల్లి గ్రామంలోని చంద్రమ్మ ఆలయంలో గుర్తుతెలియని అగంతకులు గురువారం తెల్లవారుజామున చోరీకి పాల్పడ్డారు. హుండీలోని నగదును చోరీ చేశారు. అయితే వెండి నగలను వదిలి వెళ్లారు. చోరీకి అయిన డబ్బు దాదాపు 30 వేల రూపాయల వరకు వుంటుందని గ్రామస్తులు తెలిపారు. అయితే అమ్మవారి కిరీటం, వడ్డానంతో పాటు మరికొన్ని వెండి ఆభరణాలను అగంతకులు భయంతోనో లేదా భక్తితోనో వాటిని అమ్మవారి విగ్రహం వెనుక వదిలేసి పరారయ్యారు. ఈ సంఘటనపై సిఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# బ్లాక్ స్పాట్లను పరిశీలించిన డిఎస్‌పి

గుత్తి, అక్టోబర్ 24 ప్రభాతవార్త



బ్లాక్ స్పాట్లను డిఎస్‌పి పరిశీలిస్తున్న దృశ్యం

అంకోల - నెల్లూరు 63వ జాతీయ రహదారిపై పట్టణ శివారులో ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గురు వారం గుంతకల్లు డిఎస్‌పి ఆముదాల శ్రీనివాస్ పరిశీలించారు. కొత్తపేట శివారు ప్రాంతంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో అధికంగా ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా ప్రమాద సూచికల బోర్డులను ఏర్పాటు చేస్తామని డిఎస్‌పి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# సమర్థవంతంగా విధులు నిర్వహించిన డిఇఓ మీనాక్షి

పుట్టపర్తి, అక్టోబర్ 24, ప్రభాతవార్త

శ్రీసత్యసాయి జిల్లా డిఇఓగా యు.మీనాక్షి సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించారని, ఆమె బదిలీ కావడం ఒకింత విచారకరమైన అనేక ఒడిదుడుకలను తట్టుకొని విద్యాభివృద్ధికిపాటు పడ్డారని వైఎస్ఆర్‌టిఎ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.వి.రమణారెడ్డి, ఎం.ఇంద్రప్రసాద్‌లు, శ్రీసత్యసాయిజిల్లా శాఖ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేస్తూ డిఇఓ మీనాక్షి ఎటువంటి రాజకీయ ఒత్తిళ్ళకు తలొగ్గకుండా తన బాదవీ బాధ్యతలను ముక్కుసూటిగా నిర్వర్తించి విద్యాశాఖకు వన్నె తెచ్చారన్నారు. జిల్లాలో విద్యాశాఖను అన్నివిధాల అభివృద్ధి పథంలో నిలిపినందుకు వైఎస్ఆర్‌టిఎ శాఖ అభినందనలు తెలుపుతోందన్నారు. ఆమె వైఎస్ఆర్ కడప జిల్లా డిఇఓగా వెళుతున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

# అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ

**- సెంటర్‌లోనే బీరు బాటిళ్లను అలాగే అపరిశుభ్రతపై అంగన్‌వాడీ కార్యకర్తలపై ఆగ్రహం**

కనగానపల్లి, అక్టోబర్ 24 ప్రభాతవార్త



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్‌ఈ మల్లికార్జునప్ప

మండల కేంద్రంలోని మెయిన్ ప్రాథమిక పాఠశాల వద్ద ఉన్న రెండు అంగన్వాడీ కేంద్రాలను గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ మల్లికార్జునప్ప తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రం కాంపౌండ్‌లో బీరు బాటిల్లు కనపడటంతో అలాగే కాంపౌండ్‌లోని మూత్ర విసర్జన ఇక్కడే చేయిస్తున్నారా ఇంత వాసన వస్తుందని అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మిదేవిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఇంటిలో కూడా నా అపరిశుభ్రంగా ఉంచుకుంటారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. టాయిలెట్ లేకపోవడంతో చిన్న పిల్లలు బయటికి పంపించలేక ఇలా చేస్తున్నామని అంగన్‌వాడీ కార్యకర్తల లక్ష్మిదేవి ఆయనకు తెలిపారు. ఏదేమైనాగాని ప్రజా ప్రతినిధుల ద్వారాకానీ అధికారుల ద్వారాగాని టాయిలెట్లు మంజూరు చేయించుకోవాలని అలాగే మన ఇంటిలో మాదిరిగా అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశుభ్రంగా ఉంచాలని ఆమెకు సూచించారు. వెంటనే టాయిలెట్‌ను నిర్మించే విధంగా ఎస్టిమేషన్ చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాబా ఫకృద్దీన్‌ను ఆదేశించారు. అలాగే మరో అంగన్‌వాడీ కేంద్రంలో సెంటర్ చుట్టూ పిచ్చి మొక్కలు మొలవడతో అలాగే అంగన్‌వాడీ భవనం చుట్టూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని అంగన్‌వాడీ కార్యకర్త వనితపై కూడా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలను మన పిల్లల్లాగా బాగా చూసుకోవాలని ఆమెకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శాంతన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాబా ఫకృద్దీన్, మండల కోఆర్డినేటర్ తిరుపాలు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులను ఆదుకోవాలని జిల్లా కలెక్టర్‌కు పరిటాల శ్రీరామ్ విజ్ఞప్తి

**- తుంపర్తి భూ బాధిత రైతుల కష్టాలను కలెక్టర్‌కు వివరించిన పరిటాల శ్రీరామ్**



వితిపత్రం అందజేస్తున్న టిడిపి నేత పరిటాల శ్రీరామ్

ధర్మవరం, అక్టోబర్ 24 ప్రభాతవార్త

ధర్మవరం నియోజకవర్గంలోగత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చేతికి వచ్చిన పంటను కోల్పోయిన రైతులను, ఆదుకోవాలని జిల్లా కలెక్టర్‌కు ధర్మవరం తెలుగుదేశంపార్టీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ విజ్ఞప్తి చేశారు. గురువారం పరిటాల శ్రీరామ పుట్టపర్తిలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ టిఎస్ చేతన్‌కు రైతుల గోడును వివరించారు. ఈ నెల 21, 22 తేదీలలో కురిసిన భారీ వర్షాల కారణంగా రైతులు పొలాల్లో వేసిన వరి, వేరుశనగ, ద్రాక్ష ఇతర పంటలు పూర్తి స్థాయిలో దెబ్బతిన్నాయన్నారు. లక్షలకు లక్షలు అప్పు చేసిన చేసి పెట్టుబడులు పెట్టి సాగు చేస్తున్న పంటలు కోల్పోవడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారన్నారు. అసలే ఖరీఫ్‌లో పంటలను కోల్పోయి ఇబ్బందుల్లో ఉన్న సమయంలో బోర్లు బావులు కింద సాగు చేసుకుంటున్న పంటలు కూడా కోల్పోయి రైతులు కోలుకోలేని స్థితిలో ఉన్నారన్నారు. బయటికి క నిపించే దానికంటే క్షేత్రస్థాయిలో నష్టం ఎక్కువగా ఉందని, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

**తుంపర్తి భూ బాధిత రైతులకు పరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి :**

ధర్మవరం రూరల్ మండల పరిధిలో గృహ నిర్మాణాల కోసం సేకరించిన వ్యవసాయ పొలాలకు పరిహ్యారం అందక గత ఆరేళ్లుగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతూన్నరని జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్ దృష్టికి పరిటాల శ్రీరామ్ తీసుకెళ్లారు. తుంపర్తిలో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలకు చెందిన 90 మంది నిరుపేద కుటుంబాల నుంచి 2017 నవంబర్ 12న గృహ నిర్మాణాల కోసం 210 ఎకరాల భూమిని పోతులనాగేపల్లి రెవెన్యూ పరిధిలో సేకరించారన్నారు. ఒక ఎకరా పొలం 2 కోట్లు విలువ ఉన్న భూములకు, ఎకరాకు 5 లక్షల పరిహారం చెల్లిస్తామని చెప్పగా కొంత మంది రైతులు మాత్రం పరిహ్యారం తీసుకోగా, మెజార్టీ శాతం రైతులు ఒప్పుకోకపోవడంతో ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా అడ్డుకున్న రైతులపై పోలీసు కేసులు బనాయించిన విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ అన్యాయంపై సంబంధిత రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా రైతులకు న్యాయం చేయాలని ఆదేశాలు ఇచ్చిన విషయాన్ని వివరించారు. ఇళ్ల స్థలాల కోసం పచ్చని పంటలు పండే భూములను తీసుకోవడమే కాకుండా రైతులను నడిరోడ్డుకీడ్చారని శ్రీరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కచ్చితంగా ఇది ప్రజా ప్రభుత్వమని రైతులకు త్వరలో నిర్ణయంజరుగుతుందని శ్రీరామ్ అన్నారు.

# మున్సిపల్ ఉద్యోగులు బాధ్యతతో విధులు నిర్వర్తించాలి

**- మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్**




మాట్లాడుతున్న కమిషనర్ ప్రమోద్‌కుమార్

ధర్మవరం, అక్టోబర్ 24 ప్రభాతవార్త

ధర్మవరం మున్సిపల్ ఉద్యోగులు బాధ్యతతో సేవలను నిర్వర్తించాలని, అప్పుడే పురపాలక సంఘ కార్యాలయమునకు మంచి గుర్తింపు లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ అమినిటీ సెక్రెటరీస్, మున్సిపల్ ఇంజినీర్, హౌసింగ్ ఇంజినీర్ స్ తో సమావేశాన్ని నిర్వహించి, కొనసాగుతున్న ప్రస్తుత పనులు, సేవల పర్యావరణాన్ని ఆయన సమీక్షించారు. సమావేశంలో ముఖ్యాంశాలులో వారు మాట్లాడుతూ.. సమస్యల ట్రాకింగ్ కొరకు విద్యుత్ (స్ట్రీట్ లైట్), నీటి సరఫరా సమస్యల కోసం ఒక రిజిస్టర్ కార్యదర్శిలు నిర్వహించాలని, పరిష్కరించని సమస్యలను సంబంధిత ఇంజినీర్స్‌కి అందించాలని ఆయన ఆదేశించారు. హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌చే నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి ప్రస్తుత హౌసింగ్ వర్కర్స్ స్థితిని సమీక్షించడం జరిగిందన్నారు. తక్కువ పనితీరు చూపిస్తున్న కార్యదర్శిల గురించి ప్రత్యేక సమీక్షలు నిర్వహించబడ్డాయని, మెరుగుదలకు కఠినమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. నీటి నాణ్యత వినియోగదారుల ఫీడ్‌బ్యాక్‌తోపాటు నీటి నాణ్యత పరీక్ష ఫలితాలను నమోదు చేయడానికి ఒక రిజిస్టర్ నిర్వహించాలని ఆదేశించడం జరిగిందన్నారు. వార్డ్ సచివాలయాలలోని ఇంటర్నెట్ సమస్యలను పరిష్కరించడానికి ఇంజినీర్స్‌కు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. పట్టణంలోని ఏ వార్డు సమస్యలు కూడా రాకుండా తగిన జాగ్రత్తలను తీసుకుంటూ విధులు నిర్వర్తించాలని తెలిపారు.

# అలరించిన నృత్య రూపకం

పుట్టపర్తి రూరల్ అక్టోబర్ 24 ప్రభాతవార్త



నృత్యం చేస్తున్న బాలవికాస్ చిన్నారులు.

పుట్టపర్తి ప్రశాంతినిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో అనకాపల్లి చెందిన యువకులు,బాలవికాస్ చిన్నారులు సాయిపదాలలో సన్మార్గవర్తనం పేరుతో అద్భుతమైన నృత్య రూపకాన్ని ప్రదర్శించారు.ఈ పర్తియాత్ర సందర్భంగా అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు అప్పల్‌నాయుడు తమ సేవా సమితి ద్వారా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు.అనంతరం ఈ సందేశాత్మకమైన నాటిక,నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. ఈ ప్రదర్శన చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది.అనంతరం భకిగీతాలను అలపంచారు.ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

గుడిబండ, అక్టోబర్ 24 ప్రభాతవార్త

గుడిబండ మండల పరిధిలోని ఎస్.రాయపురం గ్రామానికి చెందిన రామకృష్ణ (35) అనే వ్యక్తి సుమారు రెండు సంవత్సరాల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ అనారోగ్యం నుంచి కోలుకోలేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది గురువారం ఉదయం నాలుగు గంటలకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు రామకృష్ణ తల్లి లక్ష్మమ్మ వారి కుటుంబ సభ్యులు గుడిబండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గుడిబండ ఎస్ఐ ముని ప్రతాప్ ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పంచనామా కోసం మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

25-10pg10.qxd:25-10pg10.qxd 25/10/24 10:48 PM Page 1





# పాక్ టూర్‌పై వీడని సస్పెన్స్

## అందరి దృష్టి భారత్‌పైనే

## ఛాంపియన్ ట్రోఫీకి చురుకుగా ఏర్పాట్లు

**ఢిల్లీ:** ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ-2025 ఎడిషన్ నిర్వహణపై ఇంకా సస్పెన్స్ వీడటం లేదు. ఛాంపియన్స్ ట్రోఫీ నిమిత్తం టీమిండియా పాకిస్థాన్ పర్యటనకు వెళుతుందా లేదా అనేదానిపై ఉత్కంఠత నెలకొంది. ఇక ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహణ కోసం పాకిస్థాన్‌లో జరుగుతున్న ఏర్పాట్లపై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) సంతృప్తి వ్యక్తం చేసింది. టోర్నీకి సంబంధించిన పనులను వేగవంతం చేయాలని పాకిస్థాన్‌ను విజ్ఞప్తి చేసింది. ఐసీసీ సమావేశంలో పాల్గొనేందుకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఛైర్మన్ దుబాయ్ వెళ్లారు. ఈ టోర్నమెంట్‌ను నిర్వహించడానికి పాకిస్థాన్ కరాచీ, లాహోర్, రావల్పిండి లోని స్టేడియంలను మెరుగుపరచాలని నిర్ణయించుకుంది. ఈ మేరకు అభివృద్ధి వివరాలను సైతం ఐసీసీకి పిసిబి సమర్పించింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు అందరి దృష్టి భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ)పైనే ఉంది. ప్రపంచ అగ్రశ్రేణి క్రికెట్ జట్టు అయిన భారత్ లేకుండా ఛాంపియన్స్ ట్రోఫీ విజయ వంతం కాదనేది అన్ని దేశాలకు తెలిసిందే. ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) చీఫ్ రిచర్డ్ గౌల్డ్ స్పందిస్తూ భారత్ లేకుండానే ఐసీసీ టోర్నీ ముందుకు సాగదని ఇప్పటికే ప్రకటించారు. ఇదేసమయంలో టీమిండియాను పాకిస్థాన్ పంపే విషయంలో బీసీసీఐ ఇంకా ఎలాంటి ధృవీకరణ ఇవ్వ లేదు. కేంద్ర ప్రభుత్వ అనుమతి తర్వాతే జట్టును పంపే నిర్ణయం తీసుకుంటామని బోర్డు చెబుతోంది. పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వనున్న ఈ ఐసీసీ టోర్నీకి భారత్ వెళ్లడం దాదాపు కష్టమనే చెప్పాలి. మరోవైపు పాక్ మాత్రం తమ దేశంలోనే ఛాంపియన్స్ నిర్వహిస్తామని ధీమాగా చెబుతోంది. ఛాంపియన్స్ ట్రోఫీని తమ దేశంలో నిర్వహించడమే తమ తొలి ప్రాధాన్యత అని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) అంటోంది. భారత్ ప్రభుత్వం టీమిండియాను పాక్‌లో ఆడడానికి అనుమతి ఇవ్వకపోవడంతో పాటు, యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్‌లో మ్యాచ్‌ల నిర్వహణకు మొగ్గు చూపుతోందని పేర్కొంటోంది. కానీ పాకిస్థాన్‌లో భారత్ ఆడకపోయినా ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మాత్రం లాహోర్‌లోనే గడాఫీ స్టేడియంలో నిర్వహించడం జరుగుతుందని స్పష్టం చేస్తోంది. కాగా భారత్ క్రికెట్ జట్టు 16 ఏళ్లుగా పాకిస్థాన్‌లో పర్యటించ లేదు. ఛాంపియన్స్ ట్రోఫీకి కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది, 2008లో ముంబయి ఉగ్రదాడి జరిగినప్పటి నుండి పాకిస్తాన్‌లో భారత్ జట్టు పర్యటించడం లేదు. ఇరు జట్లూ ఐసీసీ టోర్నీల్లో మాత్రమే మ్యాచ్‌లు ఆడుతున్నాయి. అది కూడా తటస్థ వేదికలపైనే కావడం విశేషం. ఇప్పుడు ఛాంపియన్స్ ట్రోఫీలోనూ ఫిబ్రవరి 23న భారత్-పాకిస్థాన్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. ఇక ఫైనల్‌కు లాహోర్‌లని గడాఫీ స్టేడియం ఆతిథ్యమివ్వనుంది. మరోవైపు ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్‌తో జరిగే ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లు హైబ్రీడ్ మోడల్‌లో నిర్వహిస్తే తమకు ఎటువంటి అభ్యంతరం లేదని టీమిండియా చెబుతోంది. భారత్ ఆడే మ్యాచ్‌లు పాక్‌లో కాకుండా తటస్థ వేదికల్లో నిర్వహించడమే హైబ్రీడ్ మోడల్ లక్ష్యంగా ఉంది. అయితే దీనికి పాకిస్థాన్ మాత్రం ముందుకు వచ్చే పరిస్థితి లేదు. అయితే హైబ్రీడ్ మ్యాచ్‌ల నిర్వహణ కోసం శ్రీలంక, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా తదితర దేశాల క్రికెట్ బోర్డులు ముందుకు వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో అసలు ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ పాల్గొనే విషయమై సందిగ్ధత కొనసాగుతోంది.

**ఆట**



## వన్డే సిరీస్ శ్రీలంక కైవసం

### 5 వికెట్ల తేడాతో వెస్టిండీస్ చిత్తు

**ఢిల్లీ:** స్వదేశంలో వెస్టిండీస్‌తో జరుగుతున్న పరిమిత ఓవర్ల సిరీస్‌లలో శ్రీలంక జోరు కొనసాగుతోంది. 2-1 తేడాతో ఇప్పటికే టీ 20 సిరీస్‌ను కైవసం చేసుకున్న లంకేయులు తాజాగా వన్డే సిరీస్‌ను కూడా సొంతం చేసుకున్నారు. తాజాగా జరిగిన రెండో వన్డేలో అసలంక సేన 5 వికెట్ల తేడాతో వెస్టిండీస్‌ను చిత్తు చేసింది. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2'0 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంది. వర్షం కారణంగా 44 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన విండీస్ 36 ఓవర్లలో 189 పరుగులకు ఆలౌట్ అయింది. షెర్ఫాన్ రూథర్‌ఫర్డ్ 80 పరుగులు, గుడకశ్ మోటీ 50 పరుగులతో నాటౌట్‌గా హాఫ్ సెంచరీలు చేయడంతో వెస్టిండీస్ ఈ మాత్రం స్కోరు అయినా చేయగలిగింది. 58 పరుగుకు 8 వికెట్లు కోల్పోయిన విండీస్‌ను వీరిద్దరూ ఆదుకున్నారు. తీక్షణ 3/25, అశిత ఫెర్నాండో 3/35, హసరంగ 4/40 విండీస్‌ను దెబ్బకొట్టారు. అనంతరం స్వల్ప లక్ష్య ఛేదనకు దిగిన శ్రీలంక బ్యాటర్ అసలంక 62 పరుగులతో అర్ధసెంచరీతో రాణించి నాటౌట్‌గా 38.2 ఓవర్లలోనే 5 వికెట్లు కోల్పోయి విజయతీరాలకు చేరింది. శ్రీలంక ఇన్నింగ్స్‌లో నిషన్ మధుష్క 38 పరుగు, సమర విక్రమ 38 పరుగులతో ఓ మోస్తరు స్కోర్లు చేశారు. విండీస్ బౌలర్లలో అల్జరీ జోసఫ్ 2 వికెట్లు, మోటీ, ఛేజ్ తలో వికెట్ పడగొట్టారు. ఇక నామ మాత్రమైన మూడో వన్డే ఈ నెల 26వ తేదీన జరగనుంది.

## రెండో టెస్టు: తొలి ఇన్నింగ్స్

# 259కే కివీస్ ఆలౌట్

### అదరగొట్టిన యంగ్ స్పిన్నర్ సుందర్.. కెప్టెన్ రోహిత్ 0కి ఔట్

**ఢిల్లీ:** భారత్‌తో జరుగుతున్న రెండోటెస్టులో న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ ముగిసింది. పూనే వేదికగా గురువారం ప్రారంభమైన రెంటో టెస్టు తొలిఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ 259 పరుగులకు కుప్పకూలింది. ఓపెనర్ డేవాన్ కాన్వే 141 బంతుల్లో 76 పరుగులు, 11 ఫోర్లు, రచిన్ రవీంద్ర 105 బంతుల్లో 65 పరుగులు, 5 ఫోర్లు, ఒక సిక్స్ చేసి హాఫ్ సెంచరీలు సాధించారు. స్పిన్ ఆలౌ రౌండర్ వాషింగ్టన్ సుందర్ అదరగొట్టి కివీస్ పతనాన్ని శాసించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్లతో కివీస్ బ్యాటర్ల గుండెల్లో రైళ్లు పరుగెత్తించాడు. మరోవైపు సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ 3 వికెట్లు దక్కించుకున్నాడు. టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్ 7వ ఓవర్లోనే ఓపెనర్ టామ్ లేథమ్ 15 పరుగులతో పెవిలియన్ చేరాడు. అశ్విన్ అతడిని ఎల్‌బిడబ్ల్యూగా వెనక్కి పంపాడు. మరో ఓపెనర్ కాన్వే, యంగ్ బ్యాటర్‌రచిన్ రవీంద్రతో మంచి పార్ట్‌నర్‌షిప్ కొనసాగించాడు. దీంతో న్యూజిలాండ్ 3 వికెట్ల నష్టానికి 196 పరుగులతో పటిష్ట స్థితిలోనే నిలిచింది. ఇక మరోసారి న్యూజిలాండ్ భారీ స్కోర్ సాధించే దిశగా వెళుతున్న సమయంలో సుందర్ మ్యాజిక్ చేశాడు. 65 వ్యకిగత పరుగుల వద్ద రచిన్‌ను క్లీన్ బౌల్డ్ చేసి భారత్‌కు బ్రేక్ ఇచ్చాడు. అలాగే కొద్ది సేపటికే వికెట్ కీపర్‌టామ్ బ్లండెల్ 3పరుగులు చేసేటప్పటికీ అతడిని కూడా సుందర్ పెవిలియన్ చేర్చాడు దీంతో న్యూజిలాండ్ 5వికెట్ల నష్టానికి 201 పరుగులుకు చేరింది. ఇక స్పిన్‌కు సహకరిస్తున్న పిచ్‌పై సుందర్ ఆ తర్వాత కూడా అదిరే ప్రదర్శనతో టపటపా వికెట్లు కూల్చాడు. సుందర్ దెబ్బకు కివీస్ 62 పరుగుల వ్యవధిలో చివరి 7వికెట్లు కోల్పోయింది. కాగా ఈ ఇన్నింగ్స్‌లో మొత్తం 10 వికెట్లు స్పిన్నర్లు సుందర్, అశ్విన్‌కు దక్కడం విశేషం. ఇక ఫస్ట్ ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియాకు ఆదిలోనే షాక్ తగిలింది. భారత్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ ఒక్క పరుగు కూడా చేయకుండా డకౌట్‌గా పెవిలియన్ చేరాడు. పేసర్ టిమ్ సౌథీ ఇన్‌స్వింగర్‌కు రోహిత్ క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. దీంతోభారత్ 1 పరుగుకే తొలి వికెట్‌కోల్పోయింది. ఆట ముగిసే సమయానికి ప్రస్తుతం టీమిండియా ఒక వికెట్ కోల్పోయి 16 పరుగుల స్కోరుతోఉంది. యశస్వీ జైస్వాల్ 6 పరుగులు, శుభ్‌మన్ గిల్ 10 పరుగులతో క్రీజులో ఉన్నారు.









## దక్షిణాఫ్రికా సూపర్ విక్టరీ

### సొంతగడ్డపై పోరాడి ఓడిన బంగ్లాదేశ్

**ఢిల్లీ:** బాంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్ట్ మ్యాచ్‌లో పర్యాటక దక్షిణాఫ్రికా సూపర్ విక్టరీ సాధించింది. హోరాహోరీగా జరిగిన పోరులో 7 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా ఘన విజయం సాధించింది. చివరి దశలో పోరాడినా సొంత గడ్డపై బాంగ్లాదేశ్ జట్టుకు ఓటమి తప్ప లేదు. ఢాకా వేదిక జరిగిన తొలి టెస్టు మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన బాంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 106 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 307 పరుగులు చేయగా, దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 308 పరుగులు, ఛదనలో 3 వికెట్ల నష్టానికి 106 పరుగులు చేసి విజయతీరాలకు చేరింది. దక్షిణాఫ్రికా పేసర్ రబాడ మ్యాచ్ మొత్తంలో 9 వికెట్లు తీసి బాంగ్లాదేశ్ ఓటమికి ప్రధాన కారకుడయ్యాడు. కైల్ వెర్రిన్ తొలి ఇన్నింగ్స్‌లో 114 పరుగులతో సూపర్ సెంచరీ చేసి తమ జట్టు గెలుపునకు పునాది వేశాడు. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 106 పరుగలకు ఆలౌట్ అయింది. రబాడ, వియన్ ముల్డర్, కేశవ్ మహారాజ్ తలో మూడు వికెట్లు, డీన్ పైడిట్ ఒక వికెట్ తీసి బాంగ్లా ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చారు. బాంగ్లా ఇన్నింగ్స్‌లో మహ్మదుల్ హన్ 30 పరుగులు, తైజుల్ ఇస్లాం 16 పరుగులు, మెహిది హసన్ మిరాజ్ 13 పరుగులు, ముష్ఫికర్ రహీం 11 పరుగలతో రెండంకెల స్కోర్లు చేశారు. అనంతరం దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగసలో 308 పరుగులకు ఆలౌట్ అయింది. కైల్ వెర్రిన్ సూపర్ సెంచరీతో 114 పరుగులు చేసి తన జట్టుకు గౌరవప్రదమైన స్కోరును అందించాడు. ముల్డర్ 54 పరుగులతో హాఫ్ సెంచరీ చేసి రాణించగా, బంగ్లా బౌలర్లలో తైజుల్ ఇస్లాం 5 వికెట్లు, హసన్ మహమూద్ 3 వికెట్లు, మెహిది హసన్ మిరాజ్ 2 వికెట్లు పడగొట్టారు. ఇక 202 పరుగులు వెనుకబడి రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన బాంగ్లాదేశ్ ఈ ఇన్నింగ్స్‌లో 307 పరుగులకు ఆలౌట్ అయింది. తద్వారా దక్షిణాఫ్రికా ముందు 106 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఉంచింది. బాంగ్లా బ్యాటర్ మెహిది హసన్ మిరాజ్ 97 పరుగులు చేసి తృటిలో సెంచరీని చేజార్చుకున్నాడు. రబాడ 6 వికెట్లు తీసి బాంగ్లా పతనాన్ని శాసించాడు. కేశ్ మహారాజ్ 3 వికెట్లు, ముల్డర్ ఒక వికెట్ పడగొట్టారు.


## మైక్రోసాఫ్ట్‌ను వీడుతున్న మహిళా ఉద్యోగులు!

**ముంబై, అక్టోబరు 24:** సాఫ్ట్‌వేర్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఉద్యోగుల్లో వైవిధ్యాన్ని కాపాడేందుకు అవస్థలు పడుతోంది. ఆ సంస్థకు రాజీనామా చేసి వెళ్లిపోయే ఆరిలో కొన్ని వర్గాల సంఖ్య పెరుగుతున్నట్లు గుర్తించింది. ముఖ్యంగా మహిళలు, నల్లజాతీయులు, లాటినిక్స్‌లు కంపెనీని వీడడం ఎక్కువైంది. కంపెనీకి చెందిన డైవర్సిటీ అండ్ ఇంక్లూజన్ రిపోర్ట్ విడుదలైంది. దీనిలో ఈ విషయాలు బయటపడ్డాయి. వీటిల్లో స్వచ్ఛంద రాజీనామాలు, కంపెనీ నుంచి తొలగింపులు ఉన్నాయి. ఈ యేడాది జూన్‌తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో మొత్తం రాజీనామాల్లో 32.7శాతం మహిళలే ఉన్నట్లు తేలింది. గతేడాది 31శాతంతో పోలిస్తే ఇది స్వల్పంగా పెరిగింది. నల్లజాతీయుల రాజీనామాలు 8.7శాతం నుంచి 10శాతానికి, లాటినిక్స్ 8శాతం నుంచి 9.8శాతంకు పెరిగినట్లు తేలింది. ప్రత్యర్థి సంస్థలు తమ ఉద్యోగులను లాక్కోవడం, ఆన్‌లైన్ రిటైల్ వ్యాపారంలోకి మారడం వంటి కారణాలుగా భావిస్తోంది. ప్రాతినిధ్యం లేని వివిధ వర్గాల ప్రజలను నియమించుకోవడాన్ని మైక్రోసాఫ్ట్ కొనసాగిస్తుందని సంస్థ డైవర్సిటీ అధికారి లిండ్సే రే మైక్‌ఇంటైర్ వెల్లడించారు. అలా నియమించుకొన్న వారిని మెంటార్లను ఏర్పాటు చేసి కెరీర్ ఆప్షన్లు ఇస్తామని తెలిపారు. అప్పుడే వారు నమ్మకముంచి మైక్రోసాఫ్ట్‌లో కొనసాగుతారన్నారు. ఇప్పటికే క్లౌడ్ రంగంలో సంస్థ వేగంగా అభివృద్ధి చెందుతుండడంతో ప్రపంచవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో విస్తరిస్తోంది. దీంతో వివిధ వర్గాల ప్రజలను నియమించుకొనే అవకాశం లభిస్తోందని లిండ్సే పేర్కొన్నారు. ఉద్యోగుల్లో వైవిధ్యం సంస్థ చేపట్టే కృత్రిమ మేధ ప్రాజెక్టులకు చాలా ముఖ్యం. వీటిని జాతి,లింగవివక్ష లేకుండా తీర్చిదిద్దే అవకాశం ఉంటుంది. అతి తక్కువ కంపెనీలు మాత్రమే ఉద్యోగుల జాతి, లింగ గణాంకాలను బహిర్గతం చేస్తాయి.



## చిప్ మేకర్ ఎన్వీడియాతో రిలయన్స్ ఇండస్ట్రీస్ డీల్

**ముంబై, అక్టోబరు 24:** రిలయన్స్-ఎన్వీడియా కలిసి దేశంలో ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్మించడానికి భాగస్వామ్యం కలిగి ఉన్నాయని ఎన్వీడియా సిఇఒ జెన్సన్ హువాంగ్ ప్రకటించారు. ప్రస్తుతం ఏఐ అభివృద్ధిలో అతిపెద్ద చిప్ తయారీదారుల్లో ఒకటిగా ఉన్న ఎన్వీడియా కీలక ఆటగాడిగా మారిన విషయం విదితమే. అత్యధిక జనాభా కలిగి, అధిక సంఖ్యలో కంప్యూటర్ ఇంజినీర్లను కలిగి ఉండడానికి ఇది ఒక అద్భుతమైన అవకాశంగా హువాంగ్ అంబానీతో అన్నారు. దీనికోసం రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో భాగస్వామిగా మారడం తనకు గౌరవంగా, విశేషంగా అందని ఎన్వీడియా సిఇఒ పేర్కొన్నారు. ముంబైలో జెన్సన్ హువాంగ్‌తో సంభాషణ సందర్భంగా ఈ విషయం బయటకు వెల్లడైంది. యుఎస్, చైనాతో పాటు, భారతదేశంలో ఉత్తమ డిజిటల్ కనెక్టివిటీ మౌలిక సదుపాయాలు ఉన్నాయని ముఖేష్ పేర్కొన్నారు. టెలికం రంగంలో జియో సేవల మాదిరిగానే ఎన్వీడియాతో భాగస్వామ్యం ద్వారా క్వాలిటీతో కూడిన ఏఐ ఇన్‌ఫ్రా అందుబాటులోకి తీసుకురాగలమని



అంబానీ బలమైన నమ్మకాన్ని ప్రదర్శించారు. దీనికి ముందు సెప్టెంబరు 2023లో రిలయన్స్-ఎన్వీడియా భారతదేశంలో ఏఐ సూపర్ కంప్యూటర్‌లను అభివృద్ధి చేస్తామని ప్రకటించాయి. దాని భాషలపై శిక్షణ పొందిన పెద్ద భాషా నమూనాలను నిర్మిస్తామని చెప్పాయి. అయితే తర్వాతి కాలంలో టాటా గ్రూప్‌తో ఇదే విధమైన భాగస్వామ్యాన్ని చిప్ మేకర్ ఆవిష్కరించింది. అయితే ఎన్వీడియా దేశీయంగా టెక్ మహీంద్రా వంటి ఇతర భారతీయ సంస్థలతో కూడా ఒప్పంద దాలను కుదుర్చుకుంది. ఇ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్‌తో కస్టమర్‌సేవలను అందించేందుకు, ఆరోగ్య రంగంలో వైద్య, పేషెంట్ కేర్ సేవలను అందించడానికి ఏఐని వినియోగించనున్నట్లు కంపెనీ వెల్లడించింది. దీనికి ముందు కొన్ని నెలల కిందట రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత అంబానీ జియో బ్రెయిన్,ఏఐ టూల్స్ గురించి వార్షిక సర్వసభ్య సమావేశంలో స్టేక్ హోల్డర్లకు వెల్లడించిన విషయం విదితమే. తాజా పరిణామాలతో రానున్న రోజుల్లో రిలయన్స్ స్టాక్ లాభపడవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, అక్టోబరు 24:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం ఫ్లాట్‌గా ముగిసాయి. విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు, కంపెనీల త్రైమాసిక ఫలితాలు అంచనాలను అందుకోలేకపోవడంతో వరుస నష్టాలతో ట్రేడవుతున్న సూచీలు, గురువారం కూడా స్వల్ప నష్టాలతో ముగిసాయి. ఉదయం సెన్సెక్స్ 80,098.30 పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమై చివరికి 16.82 పాయింట్లు నష్టపోయి 80,065 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 36 పాయింట్లు నష్టపోయి 24,399 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.84.07గా ఉంది.




అల్ట్రాటెక్ సిమెంట్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, అదానీ పోర్ట్స్ వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. హిందుస్థాన్ యూనిలీవర్, నెస్లే ఇండియా, ఐటిసి, మారుతి సుజుకి, ఏసియన్ పెయింట్స్ వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 76.49 డాలర్లుగా ఉండగా, బంగారం ఔన్సు 2,749 డాలర్ల వద్ద కొనసాగింది.

## భారత్ నుంచి ఎఐ ఎగుమతులు: ఎన్వీడియా సిఇఒ

**ముంబై, అక్టోబరు 24:** కంప్యూటర్ రంగంలో ప్రపంచానికి సుపరిచితమైన భారత్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విషయంలోనూ సత్తా చాటబోతోందని ఎన్విడియా వ్యవస్థాపకుడు, సిఇఒ జెన్సన్ హువాంగ్ అన్నారు. భవిష్యత్‌లో ప్రభావవంతమైన ఏఐ సొల్యూషన్స్‌ను ప్రపంచానికి ఎగుమతి చేయబోతోందని చెప్పారు. ఈ మేరకు ముంబైలో నిర్వహించిన ఎన్విడియా ఏఐ సమ్మిట్‌లో ఆయన మాట్లాడారు. భారత్‌లో తమ ఎకోసిస్టమ్ విస్తరణకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. కంప్యూటర్ రంగంలో ప్రపంచానికి భారత్ చాలా సుపరిచితమని, ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఎగుమతులకు హబ్‌గా ఉందని కొనియాడారు. భవిష్యత్‌లో ఎఐ ఎగుమతుల్లోనూ లీడర్‌గా మారనుందని పేర్కొన్నారు. సాఫ్ట్‌వేర్ తరహాలోనే ఎఐని భారత్ ప్రపంచదేశాలకు ఎగుమతి చేయనుందన్నారు. సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులకు అడ్డాగా ఉన్న భారత్, ఎఐ అభివృద్ధి సరఫరాలో పవర్‌హౌస్‌గా మారనుందని చెప్పారు. భవిష్యత్‌లో ప్రతి వ్యక్తికీ ఓ ఎఐ కో-పైలట్లు ఉండబోతున్నాయని చెప్పారు. ఎఐ వల్ల ఉద్యోగాలు హరించుకుపోతాయన్న ఆందోళనల పైనా హువాంగ్ స్పందించారు. ఎఐ పూర్తిగా ఉద్యోగాలు తుడిచిపెట్టబోదని, దాని స్వరూపాన్ని మారుస్తుందని పేర్కొన్నారు. వ్యక్తి కంటే ఎఐ మెరుగ్గా పని చేయగలదని భావించినప్పుడు మాత్రమే ఆ ఉద్యోగం పోతుందని చెప్పారు. భారత్‌లో ఏఐ మౌలిక సదుపాయాల కల్పనకు రిలయన్స్‌తో ఎన్వీడియా భాగస్వామ్యం కుదుర్చుకుంటున్నట్లు ఆ కంపెనీ సిఇఒ హువాంగ్ ప్రకటించారు. సమ్మిట్‌లో భాగంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముఖేష్ అంబానీతో భేటీ అయిన సందర్భంగా ఈ విషయాన్ని ప్రకటించారు. ఈ భాగస్వామ్యం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు ముఖేష్ అంబానీ పేర్కొన్నారు. అమెరికా, చైనా తర్వాత పెద్ద డిజిటల్ కనెక్టివిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ భారత్ కలిగి ఉందని ముఖేష్ పేర్కొన్నారు. ఎన్వీడియా సిఇఒ జెన్సన్ హువాంగ్‌ను బాలీవుడ్ నటుడు అక్షయ్‌కుమార్ కలిశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మార్షల్ ఆర్ట్స్ వంటి విషయాల గురించి చర్చించుకున్నారు. ఈ విషయాన్ని తెలియచేస్తూ అక్షయ్ తాజాగా ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.



## పార్లమెంటరీ కమిటీ సమావేశానికి సెబి చీఫ్ డుమ్మా

**న్యూఢిల్లీ, అక్టోబరు 24:** పార్లమెంటరీ కమిటీ సమావేశానికి సెబి చీఫ్ మాధబి పురీ బచ్ డుమ్మా కొట్టారు. దేశంలోని నియంత్రణ సంస్థల పనితీరును సమీక్షించేందుకు సెబి చీఫ్‌కు పార్లమెంటరీ కమిటీ (పిఎసి) సమన్లు జారీ చేసిన విషయం విదితమే. దీంతో అక్టోబరు 24 గురువారం ఆమె కమిటీ ముందు హాజరుకావాల్సి ఉంది. అయితే కొన్ని ముఖ్యమైన కారణాల రీత్యా తాను హాజరుకాలేనని కమిటీకి తెలియ చేశారు. దీంతో రివ్యూ కమిటీ సమావేశాన్ని వాయిదా వేసినట్లు తెలుస్తోంది. సెబి చీఫ్ గైర్హాజరుపై ప్యానెల్‌కు నేతృత్వం వహిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నేత కెసి వేణుగోపాల్ స్పందించారు. 'మొదటి కమిటీ సమావేశంలో రెగ్యులేటరీ పనితీరుపై సమీక్షించాలని భావించాం. మీటింగ్ కోసం సంబంధిత వ్యక్తులకు నోటీసులు పంపాం. వారు సమావేశం నుంచి మినహాయింపు కోరారు. కానీ మేం దాన్ని తిరస్కరించాం. ఆ తర్వాత తాను, తన బృందంతో కలిసి మీటింగ్‌కు హాజరవుతామని తెలిపారు. అయితే కొన్ని ముఖ్యమైన కారణాల వల్ల ఆమె ఢిల్లీకి వచ్చే పరిస్థితి లేదని గురువారం ఉదయం 9:30 గంటలకు మాకు సమాచారం అందింది. ఆమె అభ్యర్థనను పరిగణలోకి తీసుకొని సమావేశాన్ని వాయిదా వేశాం' అని తెలిపారు. బచ్‌కు పిఎసి కమిటీ సమన్లు పంపడం ఇది రెండోసారి.



**వాణిజ్యం**

## చైనా వస్తువుల దిగుమతులకు చెక్

**న్యూఢిల్లీ, అక్టోబరు 24:** కేంద్ర ప్రభుత్వం తాజాగా చైనా నుంచి దిగుమతయ్యే ఐదు వస్తువులపై ఐదేళ్లపాటు అమలయ్యేలా యాంటీ డంపింగ్ డ్యూటీకి తెరతీసింది. వీటిలో గ్లాస్ మిర్రర్, సెల్‌ఫోన్ ట్రాన్స్‌పరెంట్ ఫిల్మ్ తదితరాలున్నాయి. తద్వారా పొరుగు దేశం నుంచి భారీగా దిగుమతవుతున్న వస్తువులకు చెక్ పెట్టింది. దీంతో చౌక దిగుమతుల నుంచి దేశీయ తయారీదారులకు రక్షణ లభించనుంది. యాంటీడంపింగ్ డ్యూటీ విధించిన చైనా వస్తువుల జాబితాలో ఐసోప్రొపిల్ ఆల్కహాల్, సల్ఫర్ బ్లాక్, సెల్‌ఫోన్ ట్రాన్స్‌పరెంట ఫిల్మ్, థెర్మోప్లాస్టిక్ పాలీయురెథేన్, అన్‌ఫ్రేమ్డ్ గ్లాస్ మిర్రర్ చేరాయి. సాధారణ ధరల కంటే తక్కువ ధరల్లో ఈ వస్తువులు చైనా నుంచి భారత్‌కు దిగుమతి అవుతున్నాయి. రెవెన్యూ శాఖ, పరోక్ష పన్నులు, కస్టమ్స్ సెంట్రల్ బోర్డ్



విడిగా జారీ చేసిన ఐదు నోటిఫికేషన్ల ద్వారా డ్యూటీలు ఐదేళ్లపాటు అమల్లో ఉంటాయని వెల్లడించింది. మెడికల్, పారిశ్రామిక అవసరాలకు వినియోగించే ఐసోప్రొపిల్ ఆల్కహాల్‌పై టన్నుకి 82 డాలర్ల నుంచి 217 డాలర్ల మధ్య వివిధ కంపెనీలపై సుంకాన్ని విధించింది. చర్మంపై యాంటీసెప్టిక్, హ్యాండ్ శానిటైజర్‌గానూ ఈ ప్రొడక్ట్ వినియోగమవుతోంది. టెక్స్‌టైల్ డయింగ్, పేపర్, లెదర్ తయారీలో వినియోగించే సల్ఫర్‌బ్లాక్‌పై టన్నుకి 389 డాలర్ల సుంకాన్ని ప్రకటించింది. ఈ బాటలో ఆటోమోటివ్, మెడికల్, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలలో వినియోగించే థెర్మోప్లాస్టిక్ పాలీయురెథేన్‌పై కేజీకి 0.93 డాలర్ల నుంఇచ 1.58 డాలర్లు, ప్యాకేజింగ్ మెటీరియల్‌గా వినియోగించే సెల్‌ఫోన్ ట్రాన్స్‌పరెంట్ ఫిల్మ్‌పై కేజీకి 1.34 డాలర్ల చొప్పున డ్యూటీ విధించింది. అన్‌ఫ్రేమ్డ్ గ్లాస్ మిర్రర్‌లపై టన్నుకి 234 డాలర్ల యాంటీ డంపింగ్ సుంకాన్ని ప్రకటించింది. వాణిజ్య శాఖ పరిశోధన విభాగం డిజిటిఆర్ సూచనల మేరకు ప్రభుత్వం తాజా చర్యలను చేపట్టింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Plot no B11 & B12, Industrial Park, Bellary Road, Anantapur. Phone :9848996402 Mail. vaartthaatp@gmail.com, RNI No. 70088/97, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.HSD/337/18-20 Air Surcharge: Delhi : 40 Ps.